ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
శుక్రవారం 10-07-2026 పేజీలు : 16

## ప్రతి రైతు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి :

**- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సురేష్ బాబు**

చేవెళ్ల, జులై 09 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందుకోవాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సురేష్ బాబు సూచించారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన రైతులను ఉద్దేశించి గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ... రైతు రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల లబ్ధి సులభంగా అందుతుందని తెలిపారు. ఎరువుల పంపిణీ,

3 పేజీలో...

## పంచాయతీ ట్రాక్టర్ బోల్తా..

**- ఉపాధి కూలీలకు స్వల్ప గాయాలు**

**ఆరుగురికి స్వల్ప గాయాలు..**

**- ఆసుపత్రిలో చికిత్స**



మర్పల్లి జూలై 9 (విజన్ ఆంధ్ర): మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం నర్సరీ నుంచి క్రిమిటోరియం వద్దకు మొక్కలను తరలించి నాటడం పూర్తి చేశారు. అనంతరం గ్రామానికి తిరిగి వస్తున్న సమయంలో ఉపాధి హామీ కూలీలు పంచాయతీ ట్రాక్టర్‌పై ఎక్కి ప్రయాణిస్తుండగా, ట్రాక్టర్ ఒక్కసారిగా ఒక వైపు పైకి లేచడంతో కూలీలు కిందపడిపోయారు.

ఈ ఘటనలో అంజమ్మ, ఎల్లమ్మ, నరసమ్మ, రత్నమ్మ, పోచమ్మ, సువర్ణ, శివరాజమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే గ్రామ సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో అందరూ క్షేమంగా ఉన్నట్లు సర్పంచ్ తెలిపారు. చికిత్స అనంతరం కూలీలను ఇళ్లకు పంపినట్లు పేర్కొన్నారు.

## తిమ్మారెడ్డిపల్లిలో దొంగతనం..

**- నగలు అపహరణ**



9 పేజీలో...

బోధన్ డివిజన్ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు

## ప్రత్యేక శిక్షణ కార్యక్రమం...



7 పేజీలో...

## ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ”

### ప్రారంభోత్సవ కార్యక్రమం



హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో “గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, “యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ” ప్రారంభోత్సవ కార్యక్రమం

హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారత ఒలంపిక్ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష, మంత్రి వాకిటి శ్రీహరి, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, సలహాదారు జితేందర్ రెడ్డి, పుల్లెల గోపీచంద్, స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, SATG చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రముఖ క్రీడాకారులు, ద్రోణాచార్య, అర్జున అవార్డు గ్రహీతలు, కార్పొరేషన్ చైర్మన్లు ఉన్నతాధికారులు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



**-చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు**

**-పొంచి ఉన్న ప్రమాదం**

**-ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?**

వాజేడు,జూలై9(విజన్ ఆంధ్ర): వాజేడు మండలం, చెరుకూరు పంచాయతీ, బయ్యారం గ్రామంలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు గ్రామస్తుల ప్రాణాలను హరించే స్థితిలో ఉన్నాయి. కొన్ని నెలలుగా విద్యుత్ తీగలు జీరి అనంతరెడ్డి ఇంటిముందు విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. దీనిపై పలుమార్లు ఏఈ, జేఎల్ఎం అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని అనంతరెడ్డి ఆరోపించారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బయ్యారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తీరు చూస్తుంటే.. విద్యుత్ ఉద్యోగుల పని తీరు నిర్లక్ష్యానికి నిలువుద్దంలా కనబడుతుంది. ఎన్నిసార్లు విద్యుత్ సంబంధిత అధికారులకు తెలియజేసిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే పసిగట్టి తగిన చర్యలు తీసుకోవలసిన విద్యుత్ ఉద్యోగులే.. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటే ప్రమాదం జరుగుతేనే స్పందిస్తారా..? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇంటి ముందే కరెంట్ తీగలు వేలాడుతూ చేతికి అందే ఎత్తులో ఉంటే అందువల్ల ప్రమాదమని ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని విద్యుత్ అధికారులకు తెలియదా..? తెలిసిన ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేదా..? అని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ ఉద్యోగులపై చర్యలు తీసుకుని, సమస్య పరిష్కారం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

## గుడుంబా తయారీదారులపై కఠిన చర్యలు

**- ప్రభుత్వ పథకాలు రద్దవుతాయని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ హెచ్చరిక**

**- అడ్వాలపల్లిలో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్... 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం**



మల్హార్, జూలై 9 విజన్ ఆంధ్ర : భూపాలపల్లి జిల్లా ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్వాలపల్లి గ్రామంలో గురువారం ఉదయం పోలీసులు భారీ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

10 పేజీలో...

## జగిత్యాల పట్టణంలో SIR కార్యక్రమాన్ని పరిశీలించిన బీజేపీ జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి

జగిత్యాల ఆర్ సి జులై 9(విజన్ ఆంధ్ర ) : జగిత్యాల పట్టణంలోని 5వ వార్డ్ మరియు 49వ వార్డుల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ాా×=) కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి స్థానిక వార్డ్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూ SIR నమోదు ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. పార్టీ సూచనల మేరకు బీజేపీ బీఎల్ఏ ఏజెంట్లు, ఐటీ డ లీగల్ సెల్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు ప్రతి బూత్ స్థాయిలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ నమోదు ప్రక్రియను విజయవంతం చేయడానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే ప్రక్రియలో భాగంగా చనిపోయిన వారి పేర్లు, అర్హత లేని లేదా నకిలీ ఓట్లు, ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునే బాధ్యతతో అవసరమైన పత్రాలను సమర్పించి, తమ పేరును ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో నమోదు ప్రక్రియను పూర్తి స్థాయిలో నిర్వహించి ాా×= కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, బూత్ స్థాయి కార్యకర్తలకు కోరారు.

## అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం.. సిడిపిఓ వై పద్మలత..



పెద్ద శంకరంపేట్, జూలై 9: విజన్ ఆంధ్ర: అల్లాదుర్గ్: ఐసీడీఎస్ అల్లాదుర్గ్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 15 అంగన్‌వాడీ టీచర్, 17 అంగన్‌వాడీ ఆయా (గిరిజన ప్రాంతాలు) పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వై. పద్మలత తెలిపారు. దరఖాస్తులను జూలై 10 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు http://wcdw.tg.nic.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాలని సూచించారు. ప్రజావాణి లేదా కార్యాలయంలో నేరుగా ఇచ్చే దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబోమని తెలిపారు. పూర్తి వివరాలకు ఐసీడీఎస్ అల్లాదుర్గ ప్రాజెక్టు సీడీపీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

## నేడు విద్యాసంస్థలు బంద్

కాటారం డివిజన్ ప్రతినిధి, జూలై 9 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పలు విద్యార్థి సంఘాలు శుక్రవారం రాష్ట్రవ్యాప్త బందుకు పిలుపునిచ్చాయి. విద్యార్థుల స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు పలు విద్యార్థి సంఘాలు ప్రకటనలు విడుదల చేశారు. కాగా శుక్రవారం తో పాటు మరుసటి రోజు రెండవ శనివారం, తదుపరి ఆదివారం రావడంతో వరుసగా మూడు రోజులు విద్యాసంస్థలకు సెలవులుగా ఏర్పడనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు బందును పాటించే విధంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు ఇప్పటికే సమాచారం ఆయా విద్యాసంస్థలకు అందజేశారు.

### రోడ్డుపై గాయాలతో పడి ఉన్న వ్యక్తికి అండగా...

# మానవత్వం చాటుకున్న సూరారం పోలీసులు

-108 అంబులెన్స్‌తో వెంటనే ఆస్పత్రికి తరలింపు
-బాధ్యతతో స్పందించిన పోలీసుల సేవలకు స్థానికుల ప్రశంసలు
-'ప్రజల రక్షణే ధ్యేయం'ను చేతల్లో చూపిన సూరారం పోలీసులు

సూరారం, జూలై 9 (విజన్ ఆంధ్ర): విధి నిర్వహణలోనే కాదు... ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలోనూ సూరారం పోలీసులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. మద్యం మత్తులో రోడ్డుపై పడిపోయి గాయాలతో బాధపడుతున్న వ్యక్తిని గుర్తించిన పోలీసులు క్షణాల్లో స్పందించి, 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను గుర్తించి సురక్షితంగా వారి సంరక్షణలో అప్పగించారు. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లేష్ అనే వ్యక్తి మద్యం సేవించి రోడ్డుపై పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న సూరారం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆలస్యం చేయకుండా 108 అత్యవసర అంబులెన్స్ సిబ్బందిని పిలిపించి మల్లేష్‌కు ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మల్లేష్ వివరాలను సేకరించిన పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, వారి సమక్షంలో సురక్షితంగా అప్పగించారు. ఆపదలో ఉన్న వ్యక్తిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుకున్న సూరారం పోలీసుల తీరును స్థానికులు అభినందించారు. ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు అవసరమైన సమయంలో సేవాభావంతో ముందుకు రావడం పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుతుందని వారు పేర్కొన్నారు.

## డంపింగ్ యార్డు చెత్త తరలింపులో రూ.3.40 కోట్ల చెల్లింపులపై దర్యాప్తు కోరిన ఆకుల సతీష్

**-డీఈ ధీరజ్ సస్పెన్షన్‌ను స్వాగతించిన ఆకుల సతీష్**
**-ఏసీబీతో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**
**-12-06-2026న అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి**
**-ప్రజా ధనానికి సంబంధించిన అవకతవకలపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపు**
**-అక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటే పారదర్శక దర్యాప్తు తప్పనిసరి అని వ్యాఖ్య**




నిజాంపేట్, జులై 9 (విజన్ ఆంధ్ర); నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డు నుంచి చెత్త తరలింపు పనులకు సంబంధించిన రూ. 3.40 కోట్ల చెల్లింపుల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ వ్యవహారంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)తో స్వతంత్ర విచారణ నిర్వహించి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు చెత్త తరలింపు పనులకు సంబంధించిన చెల్లింపుల విషయంలో వచ్చిన ఫిర్యాదులపై నిర్వహించిన విచారణ అనంతరం ఎస్ఎన్‌డీపీ శేరిలింగంపల్లి డీఈ ధీరజ్‌ను సస్పెండ్ చేయడం స్వాగతించదగ్గ చర్య అని ఆకుల సతీష్ పేర్కొన్నారు. అయితే, ఈ వ్యవహారంలో ఇతర అధికారుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సీ సత్యనారాయణ, చెక్కులు జారీ చేసిన మాజీ కమిషనర్ రామకృష్ణ, ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ, అకౌంటెంట్ మునీమ్‌ల పాత్రపై కూడా నిష్పాక్షికంగా విచారణ జరిపి, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై ఇప్పటికే 12-06-2026న సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆకుల సతీష్ తెలిపారు. ప్రజా ధనానికి సంబంధించిన వ్యవహారాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా వాటిని ఉపేక్షించకుండా పారదర్శక దర్యాప్తు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేవలం శాఖాపరమైన చర్యలతో సరిపెట్టకుండా, స్వతంత్ర సంస్థ అయిన ఏసీబీ ద్వారా విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆకుల సతీష్ అభిప్రాయపడ్డారు. ప్రజా ధన పరిరక్షణలో ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబించాలని, బాధ్యులెవరైనా చట్టం ముందు జవాబుదారీగా నిలబడేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# గుండెపోటుతో హెల్త్ అసిస్టెంట్ మృతి

### - నివాళులు అర్పించిన కాటారం పి హెచ్ సి సిబ్బంది

కాటారం డివిజన్ ప్రతినిధి, జూలై 9 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న తేజవత్ సమ్మయ్య గుండెపోటుతో మృతి చెందారు. కాటారం మండలం గారేపల్లి లో నివాసం ఉంటున్న సమ్మయ్య బుధవారం రాత్రి నిద్రలోనే గుండెపోటు రావడంతో భూపాలపల్లి జిల్లా కేంద్ర ఆసుపత్రి కి తరలించారు. కాగా అప్పటికే ఆయన అకాల మరణం చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమ్మయ్య స్వగ్రామమైన మహా ముత్తారం మండలం నిమ్మగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు. సమ్మయ్య విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారని, అందరితో కలుపుగోలుగా ఉండేవారని, ఆయన మృతి తీవ్ర విషాదాన్ని నెలకొల్పిందని కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, డాక్టర్లు, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది సమ్మయ్య మృతదేహాన్ని సందర్శించి, తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నివాళులు అర్పించారు. డాక్టర్లు మౌనిక, హారిక, తిరుపతిరెడ్డి, వందన, సుమన్, ప్రియాంక, హెల్త్ సూపర్వైజర్ పద్మ, జిల్లా ఎపిడమిక్ టీం మెంబర్ కాపర్తి రాజు, ఐ సి టి సి కౌన్సిలర్ గాదె రమేశ్, హెల్త్ అసిస్టెంట్లు రజిత, విజయ, రజిని, నిర్మల, నాగరాణి, పద్మావతి, సునీత, పద్మ, సుజాత, సరోజన, శ్యామలత, సరళ, మనోరమ, ఫార్మసిస్టులు రజియా, నవీన్, ల్యాబ్ టెక్నీషియన్లు పుష్పలత, సాగర్ తదితర సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.



# బడుల్లో టీచర్ల సర్దుబాటుకు గ్రీన్ సిగ్నల్

## రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎడబోయిన శ్రీనివాసరెడ్డి

అక్కన్నపేట జూలై 9 విజన్ ఆంధ్ర: రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో టీచర్ల కొరతను తీర్చి, విద్యాబోధన నిరంతరాయంగా సాగేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాల్లో అవసరానికి మించి అదనంగా ఉన్న టీచర్లను, ఉపాధ్యాయులు లేని బడులకు సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు కొనసాగింపుగా వెంటనే ఈ ప్రక్రియను చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. రిటైర్ మెంట్లు, దీర్ఘకాలిక సెలవులు, ప్రమోషన్లు లేదా ఇతర పరిపాలనా కారణాలతో బడుల్లో ఏర్పడిన ఖాళీలను గుర్తించి, అక్కడ అదనపు టీచర్లను నియమించాలని డైరెక్టర్ సూచించారు. అయితే, ఈ సర్దుబాటు ప్రక్రియను ఆయా జిల్లాల కలెక్టర్ల ఆమోదంతోనే చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏ స్కూల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారనే అంశాన్నీ ప్రాతిపదికగా తీసుకుని, జీవో నెం.25 నిబంధనలకు అనుగుణంగా సబ్జెక్టుల వారీగా అవసరమైన టీచర్లను కేటాయించాలని ఆదేశించారు. ఈ వర్క్ అడ్జస్ట్ మెంట్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని డీఈవోలను కోరారు.లి

# చలో హుస్నాబాద్



అక్కన్నపేట జూలై 9 విజన్ ఆంధ్ర:గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ ఆధ్వర్యంలో చలో హుస్నాబాద్ గౌడ హక్కుల సాధన సభ ను విజయవంతం చేయాలని అక్కన్నపేట మండలంలో మీడియా సమావేశం లో బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 12 ఆదివారం రోజున హుస్నాబాద్ దీవీఖఫంక్షన్ హాల్ లో జరిగే సభను విజయవంతం చేయాలని అక్కన్నపేట్ మండల గౌడ్ అన్నలకు కోరుతున్

# రోడ్డుపై కమ్ముకున్న చెట్ల కొమ్మలు.. ప్రమాదాలకు ఆహ్వానం



## మర్పల్లి-బుదేరా ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై వాహనదారుల అవస్థలు

మర్పల్లి, జూలై 09 (విజన్ ఆంధ్ర):మండల మండల కేంద్రం రైల్వే గేట్ చౌరస్తా నుంచి బుదేరా వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై రైల్వే స్టేషన్ సమీపంలోని మూలమలుపులో చెట్ల కొమ్మలు రోడ్డుపైకి విస్తరించి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మూలమలుపు వద్ద చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు సకాలంలో కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని వాహనదారులు చెబుతున్నారు. వర్షం కురిసే సమయంలో దృశ్యమానత తగ్గిపోవడంతో పాటు చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వాలిపోవడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాద భయం వెంటాడుతోందని పేర్కొంటున్నారు.ఈ రహదారిపై నిత్యం భారీ సంఖ్యలో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండటంతో సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపైకి విస్తరించిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యం

## - ఏబీవీపీ సిద్దిపేట జిల్లా మహిళా కన్వీనర్ మృదులయ



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 9 : సిద్దిపేట జిల్లా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ హుస్నాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో జూలై 9 జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా నగరంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎబివిపి సిద్దిపేట జిల్లా మహిళా కన్వీనర్ మృదులయ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుందని ఐదు మంది విద్యార్థులతో ప్రారంభమై కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అటాక్ నుంచి కటక్ వరకు 78 లక్షల విద్యార్థుల సభ్యత్వంతో ప్రపంచములోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందని ఎబివిపి నినాదాలు నేడు దేశానికి విధానాలుగా మారాయిఅని, కాశ్మీర్ ఆర్టికల్ 360 రద్దుకై నినదించి ఉద్యమించిదన్నారు. జాతీయ భద్రత విషయంలో ఎబివిపి చేసిన ఉద్యమాలు నేడు ఈశాన్య రాష్ట్రాలు భారత్ తో బలంగా నిలుచుటకు ఆధారం అయిందని, తెలంగాణ, బెంగాల్, కేరళ మరియు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వామపక్ష విదేశీ కుట్రలను,నరహంతక నక్సలైట్ల తూటాలను ఎదురించి,జాతీయ వాదాన్ని పెంపొందించటానికి భారత్ మాతాకి జై అంటూ అనేక మంది ఎబివిపి కార్యకర్తలు ప్రాణత్యాగాలు సైతం చేశారన్నారు,అటువంటి మహా వీరులు పుట్టిన గడ్డ తెలంగాణ జాతీయ వాదాన్ని దేశభక్తిని విద్యార్థులను తెలియచేయడంలో ఎబివిపి కార్యకర్తలు నిరంతరం పనిచేస్తూరన్నారు. జాతీయ జండా పట్టుకొని భారత్ మాతాకి జై అంటూ ర్యాలీనిర్వహించారు. ఎబివిపి 78 సంవత్సరాలుగా చేస్తున్న ఈ ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు, సిద్దిపేట జిల్లా ఎస్ ఎఫ్ డి కన్వీనర్ చరణ్, హుస్నాబాద్ నగర ఉపాధ్యక్షుడు బత్తుల సంతోష్, అంజి, నగర సంయుక్త కార్యదర్శి రంజిత్, మిషన్ సాహసి కన్వీనర్ అశ్విని, మహిళా కన్వీనర్ శిరీష, ప్రసన్న, శరత్, శ్రావణ్ ,దినాకర్, అఖిల్ ,పూర్వవందర్ విద్యార్థి విద్యార్థినులు మరియు పూర్వ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆడవాలపల్లిలో గుడిసెల గుర్తింపు సర్వే

## – ఎంపీడీఓ క్రాంతి కుమార్

మల్లూర్, జూలై 9 విజన్ ఆంధ్ర : తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా మార్చాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఆడవాలపల్లి గ్రామంలో గుడిసెల గుర్తింపు సర్వే నిర్వహించారు. గురువారం ఎంపీడీఓ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలోని ప్రతి ఇంటిని, గుడిసెలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా ఈ సర్వే చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీవో మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, సర్పంచ్ అజ్మీరా సారక్క, ఉపసర్పంచి రాజేందర్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు అజ్మీరా బాలాజీ నాయక్, సమ్మయ్య నాయక్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లి 9వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్

శంకర్‌పల్లి; జులై 09 (విజన్ ఆంధ్ర): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి 9వ వార్డులో గురువారం రూ. 10 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ దశలవారీగా 15 వార్డులను అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు బాలకృష్ణ రెడ్డి, కౌన్సిలర్ లు ఆనందరావు, గణేష్, కాలనీవాసులు అమర్నాథ్, దేవ ప్రవీణ్, తిరుపతి, నితిన్ కుమార్, రవి తేజ, సంజయ్, భాను, శివ, నిఖిల్ పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులపై అవగాహన: గ్రామస్తులకు ప్రత్యక్ష శిక్షణ



ముధోల్ :జూలై 09:విజన్ ఆంధ్ర : ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ లావణ్య – శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ విపత్తు స్పందన దళం బృందం. గ్రామస్తులకు ప్రత్యక్ష ప్రదర్శనలతో శిక్షణ ఇచ్చింది.

ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ విపత్తు స్పందన దళం బృందం గ్రామస్తులకు ప్రత్యక్ష ప్రదర్శనలతో అవగాహన కల్పించింది.

ఈ సందర్భంగా బృందం నాయకుడు ముఖేష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది నవీన్, సురేష్, రమేష్ భూకంపాలు, వరదలు, పిడుగులు తదితర ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, ప్రమాదాల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. అలాగే విపత్తుల సమయంలో ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీలత, మండల అభివృద్ధి అధికారి లవకుమార్, మండల విద్యాధికారి రమణారెడ్డి, ఉప సర్పంచ్ సావిత్రి కోటయ్య, ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాధర్, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు రాజేశ్వర్, పోలీసు సిబ్బంది భీమయ్య, శ్రీనివాస్, మురళి, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ప్రతి రైతు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి

రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, డ్రిప్ సాగు పథకాలు, భవిష్యత్తులో ప్రవేశపెట్టే కొత్త వ్యవసాయ పథకాల రాయితీలు పొందేందుకు రైతు రిజిస్ట్రేషన్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటల కొనుగోళ్లు, పంట రుణాల మంజూరు, ప్రభుత్వ సేవల పారదర్శక అమలులో కూడా రైతు రిజిస్ట్రేషన్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు. అందువల్ల ఇంకా నమోదు చేసుకోని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను లేదా మీ సేవా కేంద్రాలను సంప్రదించి వెంటనే రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని నమోదు సంఖ్య పొందాలని సురేష్ బాబు కోరారు.

# మేఘాలు కదిలిపోతున్నా రాలని వాన చినుకులు



**మేఘాలు కదిలిపోతున్నా రాలని వాన చినుకులు**

**దుక్కులు దున్ని వర్షాల కొరకు వేయికళ్లతో ఎదురుచూస్తున్న రైతన్న**

**ఇప్పటివరకు సాధారణ వర్షపాతం కట్టి 60 నుంచి 70 శాతం తక్కువ నమోదు**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 9 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ లోని పలు మండలాలలో వర్షాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటిన ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. వర్షాలు కురుస్తాయన్న ఆశతో పంటలు పండించాలని ఈ ప్రాంత రైతన్నలు దుక్కులు దున్ని విత్తనాలు నాటారు.నాటిన విత్తనాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు కాపాడడానికి భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు.మరికొందరు వర్షాకాల సీజన్ దాటిపోతుందని విత్తనాలు నాటడానికి ఆందోళనలతో వర్షాల కొరకు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. వరి పంట కొరకు రైతులు వరినార్లు వేసి వర్షాల కొరకు ఎదురుచూస్తున్నారు.కానీ నేను రోజులు పైగా దాటిన వాన దేవుడు మాత్రం మేఘాలు కదిలిపోతున్న చినుకులు మాత్రం నెలరాలడం లేదు,విస్తారంగా వర్షాలు కురువాలని చెరువులు కుంటలు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతన్నలు, పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని కోరుతూ గ్రామాలలో కప్పతల్లి, బండపాశం లాంటి ఆటలు గ్రామ దేవతలకు జలాభిషేకాలు వాన ఆటలతో కోటి దేవుళ్లకు మొక్కుతున్నారు. అయినా వానదేవుడు మాత్రం కరుణించడం లేదు.ఇతర రాష్ట్రాలలో భారీ వర్షాలు కురుస్తున్న ఇక్కడ మాత్రం ఎల్ నిఒ ప్రభావంతో జూన్ నెలలో సాధారణ వర్షపాతం కంటే 60 నుంచి 70 శాతం తక్కువ నమోదు అయిందని అంచనా ప్రతిరోజు నల్లటి మబ్బులతో మేఘాలు ఉండడం చిన్నచిన్నగా చినుకులు రావడం కానీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో ఒక పెద్ద వర్షం కూడా కురవలేదు. గతంలో ఈ ప్రాంతంలో కరువుతో అల్లాడుతున్న రోజుల్లో పంటలు కాపాడుకోవడానికి బోర్లు వేయడంతో భూగర్భ జలాలు అడిగింటి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. దేవుడు కరుణించాలని వర్షాలు కురవాలని రైతులు పంటలు పండించాలని ప్రజల సుఖసంతోషాలతో ఉండాలని కోటి దేవుళ్లను వేడుకుంటున్నారు.ఎల్ నిఒ ప్రభావంతో అతివృష్టి అనావృష్టి పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో రైతంగం సమగ్ర వ్యవసాయ విధానాన్ని అలవర్చుకోవాలని ఒకే పంటపై ఆధారపడకుండా కూరగాయలు, పప్పు దాన్యాలు లాంటి పంటలకు అధిక ప్రాధాన్యత చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



# ఆయిల్ పామ్ పంట సాగు అవగాహాన సదస్సు

దౌల్తాబాద్ జులై 09 విజన్ ఆంధ్ర : దౌలతబాద్ మండల పరిధిలోని సురాయిపల్లి సలీంపూర్ గ్రామం లోలి లిఆయిల్ పామ్ పంట సాగు అవగాహాన సదస్సు నిర్వహించారులి. లిప్రభుత్వం అందించే సబ్సిడీలు మార్కెటింగు డ్రిప్ ఇరిగేషన్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు . అదే విధంగా ఎవరైతే ఆయిల్ పామ్ పంట సాగు చేసుకుంటారో వారికి అడవి పందుల బెడద నుండి రక్షణ గా చుట్టూ వైపులా ఫెన్సింగ్ వలె వెదురు మొక్కలను ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందిస్తామని తెలిపారు.. లిఅలాగే కూరగాయల సాగు చేసే వారిని నమోదు చేసుకొని ప్రభుత్వము ద్వార అందించే సబ్సిడీలు వివరించారు. ఈ కార్యక్రమంలో బాబ్య నాయక్ , ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లిఖార్జున్ గ్రామ ఉ పసర్పంచ్ అనంతయ్య రైతులు వెంకటయ్య. విష్ణుమోహన్ రెడ్డి. రొయ్యల నారాయణ తదితరులు పాల్గొన్నారు..

## సోయా పంట యాజమాన్యంపై రైతులకు అవగాహాన: శాస్త్రీయ సాగు పద్ధతులపై సూచనలు

బైంసా :జూలై 09:విజన్ ఆంధ్ర.: నిర్మల్ జిల్లా: బైంసా మండలంలోని చూచుంద్ గ్రామంలో ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో సోయా పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, గ్రామ సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి పాల్గొని శాస్త్రీయ సాగు విధానాలపై వివరించారు. నిర్మల్ జిల్లా బైంసా మండలంలోని చూచుంద్ గ్రామంలో ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో సోయా పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆకుల దినేష్, కిషోర్, గ్రామ సర్పంచ్ గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారి హరీష్ పాల్గొని రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై వివరించారు.

# ముత్యాలమ్మ చెరువు చేపల వేలం పాట

చంద్రుగొండ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామ పంచాయతీలో ఈరోజు బెండాలపాడు ముత్యాలమ్మ చెరువు చేపల వేలం పాట సర్పంచ్ బొర్రా లలిత గారి అధ్యక్షతనలో మత్స్య శాఖ అధికారి భార్గవ్, పంచాయతీ కార్యదర్శి రోహిత్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్ , ఉప సర్పంచ్ బానోవత్ బాలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ వారు 20 వేల రూపాయలతో పాట ప్రారంభించగా, పాటదారులు పోటీల మధ్య ఆంగోత్ లక్ష్మణ్ గారు 84 వేల రూపాయలకులి ఈ పాటను దక్కించుకున్నారు. ముత్యాలమ్మ చెరువు చేపల వేలం పాట దక్కించిన ఆంగోత్ లక్ష్మణ్ కు సంవత్సర కాలంపాటు అతని స్వాధీనంలో ఉ ంటుందని గ్రామ పంచాయతీ, మత్స్య శాఖ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లికారం వెంకటేశ్వర్లు గారులి , కాంగ్రెస్ గ్రామ శాఖ నాయకుడు లిమల్లం కృష్ణయ్య గారులి ,వార్డు సభ్యులు లితేజావత్ బాబు, బాటి రామారావు, బండి రాము, వర్స రాములు, బట్ట పెద్దులు, పూసం రాంబాబు, పద్దం భద్రయ్య, భూక్యా భద్రు, కుంజా నరేష్, కారం సైదులు, దీూా పొట్ట రాము, చీదర నవీన్, తూరుపాక పున్నయ్య,పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావేత్తలా..? దోపిడీదారులా..?

**పుస్తకాల విక్రయాలే ప్రైవేట్ పాఠశాలల ఆదాయ వనరుగా మారాయా?**

**- పాఠశాలలు--బుక్ స్టాళ్ల మధ్య కుమ్మక్కు ఉందన్న తల్లిదండ్రుల ఆరోపణలు**

**- విడిగా పుస్తకాలు ఇవ్వకుండా మొత్తం సెట్ కొనాలని ఒత్తిడి చేస్తున్నారనే వాదనలు**

**- టేకులపల్లిలోని ఓ బుక్ స్టాల్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు**

టేకులపల్లి జూలై 09(విజన్ ఆంధ్ర) : విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు టేకులపల్లిలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, బుక్ స్టాళ్లపై వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తున్నప్పటికీ, "వర్క్ బుక్స్", "యాక్టివిటీ బుక్స్", "స్కిల్ డెవలప్‌మెంట్ మెటీరియల్", "ప్రత్యేక స్టడీ మెటీరియల్" పేర్లతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**పుస్తకాలే బంగారు గని..?**

కొన్ని ప్రైవేట్ పాఠశాలలకు అడ్మిషన్ ఫీజుల కంటే పుస్తకాల విక్రయాల ద్వారానే అధిక ఆదాయం వస్తోందనే అభిప్రాయాన్ని తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాల విక్రయాలపై వచ్చే కమిషన్లు పాఠశాలల ఆదాయంలో కీలక భాగంగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బుక్ స్టాళ్లతో కుమ్మక్కు ఉందా..?**

కొన్ని పాఠశాలలు ముందుగానే నిర్దిష్ట బుక్ స్టాళ్లతో ఒప్పందాలు చేసుకుని, తల్లిదండ్రులను అక్కడికే వెళ్లాలని సూచిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఆ బుక్ స్టాళ్లు పాఠశాలలు సూచించిన కిట్లను సిద్ధం చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఈ వ్యవహారంలో కమిషన్లు చేతులు మారుతున్నాయా అనే అంశంపై అధికారులే స్పష్టత ఇవ్వాల్సి ఉందని తల్లిదండ్రులు అంటున్నారు.

**సెట్ కొనాల్సిందే... విడిగా పుస్తకాలు లేవా?**

ఒకటి లేదా రెండు పుస్తకాలు మాత్రమే అవసరమైనా, వాటిని విడిగా విక్రయించకుండా మొత్తం సెట్ కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో అవసరం లేని పుస్తకాలకు కూడా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ల్యాబ్ లేకున్నా కంప్యూటర్ పుస్తకం ఎందుకు?**

కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్ లేకపోయినా కంప్యూటర్ సబ్జెక్టు పుస్తకాలు తప్పనిసరిగా కొనాలని చెబుతున్నారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. బోధనకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకుండా అదనపు పుస్తకాల పేరుతో డబ్బులు వసూలు చేయడం సమంజసమేనా అని నిలదీస్తున్నారు.

**టేకులపల్లిలోని ఓ బుక్ స్టాల్‌పై ఆరోపణలు**

టేకులపల్లిలోని ఓ బుక్ స్టాల్‌లో కొన్ని పుస్తకాల సెట్‌లను మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత బుక్ స్టాల్ నిర్వాహకుల స్పందన అందాల్సి ఉంది.

**విద్యాశాఖ స్పందిస్తుందా?**

నిబంధనల ప్రకారం తల్లిదండ్రులను ఒక నిర్దిష్ట బుక్ స్టాల్ నుంచి పుస్తకాలు కొనుగోలు చేయాలని బలవంతం చేయరాదని, అవసరం లేని పుస్తకాలను కొనాలని ఒత్తిడి చేయకూడదని తల్లిదండ్రులు గుర్తు చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు అమలవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**దర్యాప్తు జరిగితే నిజాలు వెలుగులోకి వస్తాయా?**

పాఠశాలలు--బుక్ స్టాళ్ల మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలు, పుస్తకాల ధరల నిర్ణయం, కమిషన్ల వ్యవహారం, బిల్లుల జారీ, అవసరం లేని పుస్తకాల విక్రయంపై విద్యాశాఖ, వినియోగదారుల హక్కుల శాఖ, సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**తల్లిదండ్రుల డిమాండ్**

విద్య పేరుతో అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని, పుస్తకాల ధరలను పారదర్శకంగా ప్రకటించాలని, అవసరమైన పుస్తకాలనే కొనుగోలు చేసే స్వేచ్ఛ కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత పాఠశాలలు, బుక్ స్టాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**ఎంఈఓ స్పందన..?**

ఈ విషయంపై టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)ను చరవాణి ద్వారా సంప్రదించగా, "ఈ అంశం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. అధికారికంగా ఫిర్యాదు లేదా ఆధారాలు అందితే విచారణ జరిపించి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత వారిపై తగిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు..



# తాడిచర్ల కోల్ బ్లాక్-2 సింగరేణి కి కేటాయింపు హర్షనీయం

## - బీజేపీ నాయకులు

మల్హర్, జూలై 9 విజన్ ఆంధ్ర : భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల కోల్ బ్లాక్-2 ను సింగరేణికి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం మలహర్ రావు మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు బండ శ్రీకాంత్ పటేల్, అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్ రావు ఆధ్వర్యంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ 02 ను తాడిచెర్ల సింగరేణి కి కేటాయింపు పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి ఈ కేటాయింపు కోసం విశేషంగా కృషి చేసిన చంద్రుపట్ల సునీల్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కోల్ బ్లాక్ ద్వారా తాడిచర్ల, పెద్దతుండ్ల, మల్లారం గ్రామాలకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర సమ్మయ్య, ఎస్కే నిషాన్, అంగజాల సంజీవ్, లింగన్నపేట అశోక్, గిట్ల శ్రీనివాస్ రెడ్డి, అజ్మీరా అక్కీరాం నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'ఏరియా ఆసుపత్రిలో తుంటి మార్పిడి శస్త్ర చికిత్స'

మందమర్రి, జూలై 9 (విజన్ ఆంధ్ర) : అత్యాధునిక ఆర్థోపెడిక్ వైద్య సేవలను అందించేందుకు రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి మరోసారి తమ సామర్థ్యాన్ని చాటుకుంది. తుంటి మార్పిడి (టోటల్ హిప్ రీప్లేస్మెంట్) కొరకు వచ్చిన ఐలమ్మ శస్త్ర చికిత్స గురువారం విజయవంతమైనట్లు ఏరియా ఆసుపత్రి డివైసిఎంఓ మధు కుమార్ తెలిపారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సను ఆర్థోపెటిక్ వైద్యుల సుహాసిని, నరేష్, అనేస్థిషియా వైద్యురాలు మైత్రియి నిపుణుల బృందంతో కలిసి పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం పేషంట్ ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

# మృతదేహంతో రెండో రోజూ ధర్నా... కదలని ఐటీసీ!

### సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఐటీసీ గేటు ముందు ధర్నా.
### గేటు ముందే కొనసాగుతున్న కుటుంబ సభ్యులు, కార్మికుల నిరసన..
### కనీస చర్చలకూ ముందుకు రాని యాజమాన్యంపై ఆగ్రహం...
### 'న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదు' అంటున్న కాంట్రాక్టు కార్మికుల జేఏసీ...

బూర్గంపాడు మండల ప్రతినిధి జూలై 9( విజన్ ఆంధ్ర ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం, సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో గుండెపోటుతో కాంట్రాక్టు కార్మికుడు వి. నరసింహారావు మృతి చెందిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మృతదేహాన్ని ఐటీసీ ప్రధాన గేటు ఎదుట ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు, సహచర కార్మికులు చేపట్టిన నిరసన రెండో రోజుకు చేరుకున్నా యాజమాన్యం స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఐటీసీ కాంట్రాక్టు కార్మికుల జేఏసీ పెద్దఎత్తున ఆందోళనకు దిగింది. కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం, ఒక కుటుంబ సభ్యుడికి ఉద్యోగం, తగిన పరిహారం ప్రకటించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

సహచర కార్మికుడు కర్మాగారంలోనే ప్రాణాలు కోల్పోయినా, మృతదేహం రెండు రోజులుగా ప్రధాన గేటు ఎదుటే ఉండిపోయినా యాజమాన్యం చర్చలకు ముందుకు రాకపోవడం పట్ల కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. లాభాలే ముఖ్యం.. కార్మికుల ప్రాణాలకు విలువ



లేదా? అని ప్రశ్నిస్తున్నాయి. కనీస మానవతా దృక్పథం కూడా ప్రదర్శించకుండా వ్యవహరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఇప్పటికైనా ఐటీసీ యాజమాన్యం స్పందించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేసి కర్మాగారం కార్యకలాపాలను సైతం అడ్డుకుంటామని కాంట్రాక్టు కార్మికుల జేఏసీ హెచ్చరించింది. దీంతో సారపాకలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్ సూరం నాయక్ అశోక్ రామకృష్ణ జగదీష్ రావు అధిక సంఖ్యలో పాల్గొన్న యువకులు

# మర్పల్లికి 1,200 ఉచిత పత్తి విత్తనాల ప్యాకెట్లు

### 'కపాస్ కాంతి' పథకంలో క్లోజర్ స్పేసింగ్ సాగుకు అవకాశం -- 300 ఎకరాల్లో ప్రదర్శనలు

మర్పల్లి, జూలై 9 (విజన్ ఆంధ్ర): దేశంలో పత్తి ఉత్పాదకత పెంపునకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ (ఎంసీపీ) -- కపాస్ కాంతి" పథకం కింద మర్పల్లి మండలానికి 1,200 ప్యాకెట్ల రాశి కంపెనీ 'స్విఫ్ట్' పత్తి విత్తనాలు చేరుకున్నాయని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు .కేంద్ర ప్రభుత్వం 2026 మే 5న ఆమోదించిన ఈ పథకం 2026--27 నుంచి 2030--31 వరకు ఐదేళ్ల పాటు అమలులో ఉండనుంది. పత్తి సాగులో శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించడం, దిగుబడి పెంపు, రైతుల సామర్థ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. మర్పల్లి మండలానికి అందిన 1,200 ఉచిత విత్తనాల ప్యాకెట్లు 300 ఎకరాల సాగుకు సరిపోతాయని, క్లోజర్ స్పేసింగ్ విధానంలో ఎకరానికి నాలుగు ప్యాకెట్లు విత్తాల్సి ఉ



ంటుందని తెలిపారు. రైతులకు ఈ విత్తనాలు పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్ (హెచ్‌డీపీఎస్), క్లోజర్ స్పేసింగ్, ఇంటిగ్రేటెడ్ క్రాప్ మేనేజ్‌మెంట్ వంటి ఆధునిక సాగు విధానాలపై క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. పంట వివిధ దశల్లో అవసరమైన గ్రోత్ రెగ్యులేటర్లు, పురుగుమందులు సబ్సిడీపై అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశంలోని 19 రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ ప్రతిష్ఠాత్మక పథకంలో తెలంగాణ కూడా భాగస్వామ్యమైందని, పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు.

# భద్రాచలం UPN బ్యాంక్ మేనేజర్ పేరిట ఘరానా టోకరా

**-పేద గిరిజన మహిళలను నమ్మించి, రూ. లక్షల్లో దండుకున కిలాడీ లేడీ!**
**-తక్కువ వడ్డీకే గ్రూప్ లోన్లు ఇప్పిస్తామంటూ బురిడీ!**
**-అశ్వారావుపేట మండలం వాగుడ్డుగూడెం లో వెలుగుచూసిన భారీ మోసం**
**-బాధితుల ఫోన్లు బ్లాక్ చేసి, నిందితురాలు పరార్.. న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు.**

విజన్ ఆంధ్ర // భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, జూలై 10 : రెక్కాడితే గాని డొక్కాడని పేద గిరిజన మహిళల అమాయకత్వాన్ని, ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని ఒక కిలాడీ లేడీ భారీ వంచనకు పాల్పడింది. "మీకు తక్కువ వడ్డీకే రూ. 50,000 చొప్పు న గ్రూప్‌లోన్లు ఇప్పిస్తా... నా భర్త భద్రాచలంలో UPN బ్యాంక్ మేనేజర్" అంటూ నమ్మబలికి, సుమారు 35 మంది మహిళల నుండి లక్షలాదిరూపాయలు వసూలు చేసి రాత్రికి రాత్రే పరారి ఘటనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో కలకలం రేపింది.

**అసలేం జరిగిందంటే..**

బాధితులు పోలీసులకు సమర్పించిన లిఖితపూర్వక ఫిర్యాదు ప్రకారం... అశ్వారావుపేట మండలం, ఊట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వాగుడ్డు గూడెం గ్రామానికి చెందిన పేద గిరిజన మహిళల వద్దకు రమణక్కపేట గ్రామ వాస్తవ్యురాలు, ప్రస్తుతం నారంవారిగూడెం కాలనీలో నివసిస్తున్న సోడం రాధ అనే మహిళ వచ్చింది. తన భర్త మునుగొండ. శేషు భద్రాచలంలోని ఖూచీ బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడని పరిచయం చేసుకుంది. తమ బ్యాంక్ ద్వారా మహిళలకు అతి తక్కువ వడ్డీకే గ్రూప్ లోన్లు ఇప్పిస్తామని నమ్మబలికింది. ఆమె మాటలు నమ్మిన వాగొడ్డుగూడెం గ్రామానికి చెందిన సుమారు 35 మంది మహిళలు లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో రాధ ఒక్కొక్కరి నుండి మొదటి విడతగా రూ. 1000, ఆ తర్వాత రూ. 3000, ఆపై డాక్యుమషన్, ఓటర్ లిస్ట్ ఖర్చుల పేరిట మరో రూ. 950 చొప్పున వసూలు చేసింది. రూ. 50,000 లోన్ రావాలంటే అడ్వాన్స్ మరియు వడ్డీ షేర్ కింద 10% కట్టాలని చెప్పి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజింది.

**ఫోన్ స్విచ్ఛాఫ్.. అడిగితే బెదిరింపులు!**

ఈ నెల జూలై 6న లోన్ అమౌంట్ ఇస్తానని నమ్మబలికిన రాధ, ఆ తర్వాత నుండి తన మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. దీంతో ఆందోళనకు



గురైన బాధితులు కే. అంగమ్మ, కే. నాగదుర్గ, కే. రామకృష్ణ, ఎం. వీరమ్మ, కే. రాధ, కే. సావిత్రి తదితరులు కలిసి నారంవారిగూడెంలోని ఆమె నివాసానికి వెళ్లి వెతికారు. అయితే అప్పటికే ఆమె అక్కడి నుండి పరారైనట్లు తెలిసింది. ఈ విషయమై ఆమె భర్త మునుగొండ. శేషును నిలదీయగా.. వారు బాధితుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తీవ్ర పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులకు దిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మాకు న్యాయం చేయండి, బాధితుల ఆక్రందన

కూలీ నాలీ చేసుకునే తమ నోటికాడి కూడును లాక్కుని, లోన్ల పేరిట ఆశ చూపి నిలువునా ముంచేసిన కిలాడీ లేడీ సోడం రాధ, ఆమెకు సహకరించిన భర్త మునుగొండ. శేషు పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను కలిసి బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు తక్షణమే స్పందించి తమకు రావలసిన డబ్బులను రికవరీ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితులు కన్నీరుమున్నీరవుతూ వేడుకుంటున్నారు.

# కేసీఆర్ నమ్మకానికి నిదర్శనం..



### పార్లమెంట్ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

### - ఖమ్మంలో ఘనంగా శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

విజన్ ఆంధ్ర : భద్రాద్రి కొత్తగూడె, దమ్మపేట జూలై 10 : తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ పార్లమెంట్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా నియమించారు.
ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, "పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గొంతుకగా, బీఆర్ఎస్ పార్టీ విధానాలను సమర్థవంతంగా వినిపించే నాయకత్వ లక్షణాలు ఉన్నందుకే కేసీఆర్ రవిచంద్రకు ఈ కీలక బాధ్యతను అప్పగించారు. ఆయన నాయకత్వంలో పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం బీఆర్ఎస్ మరింత బలంగా పోరాడుతుంది" అని పేర్కొన్నారు.
పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, రవిచంద్ర నియామకం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని ఆయన అన్నారు.
నమ్మకానికి గుర్తింపు.. కృషికి ప్రతిఫలం
బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న వద్దిరాజు రవిచంద్రకు పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ బాధ్యతలు దక్కడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో మైలురాయిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.



# పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులను ఆదుకోండి: మంత్రి తుమ్మలను కోరిన తాటి

విజన్ ఆంధ్ర : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట, జూలై 10: పెద్దవాగు ప్రాజెక్ట్ గండిపడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయకట్టు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, పెద్దవాగు ప్రాజెక్ట్ దెబ్బతినడంతో ఆయకట్టు రైతులు వరుసగా మూడు పంట సీజన్లుగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చించి, పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులను అత్యవసరంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
అదేవిధంగా, పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులతో కలిసి త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగునీటి ఇబ్బందులను నేరుగా వివరించనున్నట్లు తాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

# గిరిజనుల సమస్యల పరిష్కారానికి సున్నితంగా స్పందించాలి..సీపీ అంబర్ కిషోర్ ఝూ



బెల్లంపల్లి జులై 9 విజన్ ఆంధ్ర : గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు మరింత చేరువగా, స్నేహపూర్వకంగా పోలీసింగ్ అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మాదారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్ నిర్వహణ, రికార్డులు, కమ్యూనికేషన్ వ్యవస్థ, పోలీసు వాహనాల నిర్వహణను పరిశీలించారు. పెండింగ్ కేసులు, రౌడీషీటర్లు, అనుమానితుల వివరాలను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. గిరిజనులతో సున్నితంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను అర్థం చేసుకుని విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించిన సీపీ,
హాక్ఐ, టీఎస్‌కాప్, సీసీటీఎన్ఎస్ వంటి సాంకేతిక సేవలను సమర్థంగా వినియోగించి ప్రజలకు ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్, ఆకస్మిక వాహన తనిఖీలు కొనసాగిస్తూ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీసు అధికారులతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన సీపీ, మాదారం పోలీస్ స్టేషన్ నిర్వహణ, సౌకర్యాలు, పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ ఎస్ఐ, సీఐతో పాటు సిబ్బందిని అభినందించారు.

# నూతన బ్రిడ్జ్ ను ప్రారంభించిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి

### - ఉమ్మడి మండల అభివృద్ధికి కృషి చేస్తా

గాదిగూడ,జులై 09(విజన్ ఆంధ్ర):మండలంలోని లోకారి (కే) గ్రామ ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. నూతనంగా నిర్మించిన బ్రిడ్జ నుగురువారం ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ప్రారంభించారు.అనంతరం ఝరి గాదిగూడ బ్రిడ్జ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల ప్రజలు లోకారి గ్రామ కల్వర్టు వల్ల భారీ వర్షాలకు తెగిపోతున్న రోడ్డు కారణంగా అవస్థలు పడేది.ఇకపై ఈ బ్రిడ్జ నిర్మాణంతో గ్రామ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.దీని తో పాటు ఖాడికి,ధాబా కే, బ్రిడ్జ లను నిర్మించేందుకు అతి త్వరలో కృషి చేస్తానాని అన్నారు.రోడ్డు రవాణా,వైద్య,విద్యా అవసరాలకు నిరంతరాయంగా రోడ్డు అనుసంధానం ఉంటుంది. ప్రజల సంక్షేమే మా లక్ష్యం అని తెలిపారు.మండలంలోని మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని అన్నారు.ఈ బ్రిడ్జ్, రోడ్డు పనులు ప్రారంభించడం హర్షణీయం అన్నారు.నిర్దేశిత గడువులోపు పూర్తి చేసిన కాంట్రాక్టర్ మాజీ వైస్ ఎంపీపీ మార్షవనే యోగేష్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పూసం బాధిరావ్,మాజీ సర్పంచ్ మెస్రం జైవంత్ రావ్, మాజీ సర్పంచ్ ఆత్రం ఇంద్రబాన్,సుద్దాం, మారుతీ,భీర్నావ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు,గ్రామస్తులు,పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ఫారముల ఆన్ లైన్ వెంట వెంటనే పూర్తి చేయాలి

## –జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా

ముధోల్ :జూలై 09:విజన్ ఆంధ్ర : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం బాసర, తానూర్, కుబీర్, మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా బాసర గ్రామపంచాయితీ ఆవరణలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. గడువులోగా ఎస్ఐఆర్ ఫారముల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ఫారంలను పూరించుటలో ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎస్ఐఆర్ విషయంలో సహాయం చేయాలన్నారు. సూపర్వైజర్లు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.
అనంతరం తానూరు మండలం సింగన్ గావ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం పంపిణీ చేసిన ఫారములు, ఇప్పటివరకు, తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తి చేసిన డిజిటలైజేషన్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.
కుబీర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ ఫారములు నింపుటలో ఓటర్లకు సహాయం చేయాలని బిఎల్ఓ లకు అధికారులకు సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన డిజిటలైజేషన్ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్ లో వివరాలను పరిశీలించారు. సమీపంలోని ఓటర్ ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేశారో లేదో అడిగి తెలుసుకున్నారు.
ఈ తనిఖీలలో తహసిల్దార్లు పవన్ చంద్ర, మహేంద్రనాథ్, శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ లు వెంకటేష్ గౌడ్, అన్నపూర్ణ, సాయినాథ్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ



భూపాలపల్లి జిల్లా జులై 09 (విజన్ ఆంధ్ర ) జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జె. జీవన్ కుమార్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ లు మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న వివిధ కోర్టు కేసుల పురోగతిపై చర్చించారు. కేసులు త్వరితగతిన పరిష్కారానికి, న్యాయ ప్రక్రియ మరింత వేగవంతం కావడానికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి.అఖిల తదితరులు పాల్గొన్నారు.



## ఎన్యుమరేషన్ ఫారంలో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయించాలి

కుల్కచర్ల, జూలై, 09(విజన్ ఆంధ్ర): ఎన్యుమరేషన్ ఫారంలో వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయించేలా చూడాలని కుల్కచర్ల తహసీల్దార్ పురుషోత్తం, డిప్యూటీ తహసీల్దార్ మురళి సూచించారు. కుల్కచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్ఓలతో సమావేశమైనారు. సర్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ....ఓటరు లిస్టులో పేర్ల నమోదు, మరణించిన వారి పేర్లు తొలగించడం అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఫారంలో వివరాలు అన్నింటినీ నమోదు చేసి సరైన సమయంలో బీఎల్ఓలకు అందించాలని సూచించారు. ప్రజలందరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలి తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ భీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య గౌడ్, బీఎల్ఓలు, ఆయా పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం కింద ప్రతి కుటుంబానికి ఆరు మొక్కల పంపిణీ



ముధోల్ :జూలై 09:విజన్ ఆంధ్ర. ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామ పంచాయతీలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబానికి ఆరు మొక్కలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ రుచిత దిగంబర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు మొక్కలు అందజేశారు. గ్రామ సర్పంచ్ రుచిత దిగంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు మొక్కలను అంద జేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబం అందజేసిన ఆరు మొక్కలను తప్పనిసరిగా నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మొక్కల పెంపకంతో గ్రామంలో పచ్చదనం పెంపొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## బలహన్‌పూర్‌లో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలి: కొండు బానేష్..

బెల్లంపల్లి జులై 9 విజన్ ఆంధ్ర : తాండూర్ మండలం రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని బలహన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని సీపీఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ కోరారు. గ్రామంలో 150 మంది జనాభా, 30 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ పాఠశాల లేక 20 మంది విద్యార్థులు మూడు కిలోమీటర్లు నడిచి రేచిని గ్రామానికి వెళ్లి చదువుకుంటున్నారని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు నిత్యం ఆందోళన చెందుతున్నారని అన్నారు. కొందరు విద్యార్థులు బంధువుల వద్ద ఉండి చదువుకుంటుండగా, మరికొందరు చదువు మానేసి వ్యవసాయ పనులకు వెళ్తున్నారని పేర్కొన్నారు. 2004 వరకు మర్రిచెట్టు కింద నిర్వహించిన పాఠశాలను భవనం లేక మూసివేశారని గుర్తు చేశారు. గ్రామానికి పాఠశాల మంజూరైతే భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా అందిస్తామని గ్రామస్తులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

# అరుణోదయ నాగన్న సేవలు... చిరస్మరణీయం

**-- నాగన్న సంతాప సభను జయప్రదం చేయండి...**

**-- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై.ప్రకాష్**



కారేపల్లి,జూలై 9 (విజన్ ఆంధ్ర) : తన జీవిత కాలమంతా విప్లవ పార్టీల గొంతుకగా నిలిచి,అట్టడుగు వర్గాల చైతన్యానికి తన పాటల ద్వారా కృషి చేశారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కారేపల్లి మండల కార్యదర్శి వై.ప్రకాష్ అన్నారు.గురువారం సింగరేణి మండలం పేరుపల్లి గ్రామంలో ప్రముఖ విప్లవ,సాంస్కృతికోద్యమ నాయకుడు,గేయ రచయిత అరుణోదయ నాగన్న సంతాప సభను నిర్వహించారు.ఈ సభను ఉద్దేశించి మండల కార్యదర్శి వై.ప్రకాష్ మాట్లాడుతూ.. చిరుప్రాయంలోనే కాళ్ళకు గజ్జె కట్టి,గళమెత్తి ఉద్యమ పాటలు పాడిన నాగన్న'అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య'వ్యవస్థాపక సభ్యుడిగా పనిచేశారన్నారు.తన ఇంటి పేరుని అరుణోదయగా మార్చుకొని గత 50 సంవత్సరాల కాలంలో రైతు కూలీలు,కార్మికులు, యువతి యువకులు పీడిత ప్రజలు,విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు.నాగన్న స్వగ్రామమైన రాజారాం గ్రామంలో ఈనెల 13నఉదయం 10 గంటలకు జరుగు బహిరంగ సంతాప సభలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల గ్రామ నాయకులు అలెం గురవయ్య,చంద్రయ్య,పిడబ్ల్యు జిల్లా కార్యదర్శి వై.జానకి,సుగుణ,కోటక్క,నాగేశ్వరరావు,నరేష్, సమ్మయ్య,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు



అందోల్ జూలై 9 (విజన్ ఆంధ్ర ప్రతినిధి )సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణానికి రూ. 2కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహగారి చొరవతోనే ఈ నిధులు మంజూరు అయ్యాయి.సంగారెడ్డి జిల్లా జోగిపేటలో చాలా సంవత్సరాలుగా ప్రైవేట్ భవనంలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా, ప్రజలు చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారు.నూతన భవనం అన్ని వసతులతో నిర్మాణం జరుగుతుంది.అందోల్ నియోజకవర్గ కేంద్రంలో అభివృద్ధిలో మరో మైలురాయిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం నిర్మాణం నిలుస్తుంది.ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు ప్రభుత్వం మరో కీలక అడుగు.ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన రిజిస్ట్రేషన్ సేవలందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనం.జోగిపేటలో సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేయించినందుకు రాష్ట్ర మంత్రి సి.దామోదర రాజనర్సింహ అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎ.చిట్టిబాబు,ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# పీఆర్సీ, సీఎస్ఆర్సీ అమలు చేయాలి: టీఎన్టీయూసీ



మంచిర్యాల, జూలై 9 విజన్ ఆంధ్ర : సింగరేణి అధికారుల సంఘం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు టీఎన్టీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (ఎస్‌సీఎల్‌యూ) నాయకులు గురువారం సంఘీభావం తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎస్‌సీఎల్‌యూ అధ్యక్షుడు పెద్దపెల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి టి. మణిరామ్ సింగ్ మాట్లాడుతూ అధికారుల పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, సీఎస్ఆర్సీ అమలు చేసి బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధనకు టీఎన్టీయూసీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అధికారుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే సింగరేణి వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గద్దెల నారాయణ, రఘుపతి, ఎం. దామోదర్ రెడ్డి, పి. రాజన్న, ఉండి శ్రీనివాస్, బొంది మల్లయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బోధన్ డివిజన్ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం...

బోధన్, జూలై 9 (విజన్ ఆంధ్ర) : గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి, నిధుల సద్వినియోగమే లక్ష్యంగా బోధన్ డివిజన్ పరిధిలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం పట్టణంలోని లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు.? ?ఈ సందర్భంగా శిక్షణాధికారులు మాట్లాడుతూ, 16వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో అత్యంత అవసరమైన పనులకు మాత్రమే ప్రాధాన్యత క్రమంలో కేటాయించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, మురుగునీటి కాల్వల నిర్మాణం వంటి ప్రాథమిక అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. నిధుల దుర్వినియోగం కాకుండా ప్రతి పైసాకు జవాబుదారీతనంతో కూడిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ?గ్రామాల ప్రగతిలో వీబీ జి గ్రామ్ ప్రణాళికల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా వివరించారు. కేవలం పంచాయతీ శాఖ మాత్రమే కాకుండా, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమ శాఖల వంటి వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య అంతర్-శాఖల సమన్వయం ఉంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయని అధికారులు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి గ్రామ అభివృద్ధి ప్రణాళికలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

?ఈ శిక్షణ కార్యక్రమంలో నోడల్ రాష్ట్ర అధికారి సుబ్రహ్మణ్యం, డీఆర్డీఓ సాయన్న, సీఈఓ సాయగౌడ్, డీఎల్పీఓ నాగరాజు, డివిజన్ పరిధిలోని పలువురు ఎంపిడిఓ లు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ వేగవంతం

చిలిపిచేడ్ జూలై 9 విజన్ ఆంధ్ర: చిలిపిచేడ్ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో అంగన్వాడి కేంద్రాలలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ శిబిరాలలో ఆయా గ్రామాల ఓటర్లు తమ తమ ఎస్ఐఆర్ ఫారాలను పూర్తి వివరాలతో నింపి బిఎల్ఓ లకు అందించి ఆన్లైన్ లో ఎన్యుమరేషన్ వివరాలు నమోదు చేసుకోవాలని చిలిపిచేడ్ మండల తాసిల్దార్ శివప్రసాద్ అన్నారు. గురువారం నాడు చిలిపిచేడ్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ శిబిరాన్ని పరిశీలించి ఓటర్లతో ముచ్చటించారు. సర్ ప్రక్రియ జులై 24 తేదీ నే చివరి రోజు కావడంతో బిఎల్ఓ లకు గ్రామంలోని ఆయా పార్టీల బిఎల్ఎలు, పంచాయతీ కార్యదర్శులు, వివోఏలు, రేషన్ డీలర్లు, జిపిఓలు అంత సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శివప్రసాద్, ఆర్ఐ శ్రీహరి, బిఎల్ఓ ప్రశాంతి, జిపిఓలు జనార్దన్ రెడ్డి, రాధాకృష్ణ, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామ సర్పంచ్ అనిల్, బిఎల్ఏలు సత్యనారాయణ, రామకృష్ణ, రాజాగౌడ్, అనిల్ , శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితురాలికి ఆర్థిక సహాయం

ఇబ్రహీంపట్నం , జూలై 9 (విజన్ ఆంధ్ర ): యాచారం గ్రామ పంచాయతీ సిబ్బంది కంబాలపల్లి రామచంద్ర కుమార్తె మాధవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ప్రమాదం అనంతరం ఆమెకు వైద్య చికిత్స తీసుకొని ఆసుపత్రి నుండి డిచార్జ్ అయ్యింది. చికిత్స అనంతరం ఖర్చులు భరించలేక కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం స్థానికంగా తెలిసిన వెంటనే బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి మానవత్వంతో స్పందించారు. మాధవి కుటుంబ పరిస్థితిని స్వయంగా తెలుసుకున్న బూడద రామ్ రెడ్డి, ఆమె వైద్య చికిత్సకు తోడ్పాటుగా రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని ఆ ఫౌండేషన్ కమిటీ సభ్యుల ద్వారా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు.

ఈ ఆర్థిక సహాయం అందుకోవడంతో మాధవి కుటుంబ సభ్యులు బూడిద రామ్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టకాలంలో ఆదుకున్న ఆయన సేవాభావాన్ని వారు కొనియాడారు.



స్థానిక ప్రజలు కూడా బిఆర్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, అవసరంలో ఉన్న వారికి ఇలాంటి సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా బిఆర్ఆర్ ఫౌండేషన్ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, విద్య, వైద్యం, అత్యవసర పరిస్థితుల్లో పేదలకు చేయూతనిస్తూ సమాజంలో మంచి గుర్తింపు పొందుతోందని స్థానికులు తెలిపారు. ఈ ఘటన మరోసారి ఫౌండేషన్ సేవా దృక్పథాన్ని చాటిందని వారు అభిప్రాయపడ్డారు.

# పంచాయతీ అభివృద్దే లక్ష్యం



–సర్దార్ వలి

అనంతపురం రూరల్, జులై 9 ( విజన్ ఆంధ్ర ): ప్రజలకు అవసరమయ్యే అన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ పంచాయతీకి మంచి గుర్తింపు వచ్చే విధంగా ప్రజలతో కలిసి పని చేస్తామని ఏ. నారాయనపురం మొదటి శ్రేణి నూతన కార్యదర్శి సర్దార్ వలి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తాము ఈ మధ్యనే పదోన్నతిపైన బాధ్యతలు చేపట్టడం జరిగిందని అన్నారు. పంచాయతీ నిధులను ప్రజలకు అవసరమైన వాటికీ మాత్రమే ఉపయోగించి ఖర్చు చేస్తామని కార్యదర్శి తెలిపారు. నిధులు పక్కదారి అయ్యాయనే ఆరోపణలలో ఎంత మాత్రం నిజం లేదని సర్దార్ వలి స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను హుస్నాబాద్ లో నిర్వహించాలి

**డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి రెడ్డి**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 9 :ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలను హుస్నాబాద్ డివిజన్ లో ఏర్పాటు చేయాలని డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతి రెడ్డి కోరారు.డిటిఎఫ్ హుస్నాబాద్, అక్కన్నపేట, కోహేడ మూడు మండలాల ఉపాధ్యాయ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని డి.టి.యఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వి. వెంకట రమణారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెండింగ్ డిఎ లు చెల్లించి, పిఆర్సి వెంటనే అమలుచేయాలని, ఎవరూ అడగని ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం అమలు మానుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ వి.వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిర్వహించే మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని హుస్నాబాద్ డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారులకు విజ్ఞప్తి చేసారు.

ఉపాధ్యాయులకు అందుబాటులో పెట్టాల్సిన శిక్షణా కార్యక్రమాలను సిద్దిపేట, గజ్వేల్ లలో నిర్వహిస్తూ హుస్నాబాద్ డివిజన్ అయినప్పటికీ ఇక్కడ నిర్వహించకపోవడం దురదృష్టకరమని ఒకరకంగా హుస్నాబాద్ డివిజన్ ను చిన్నచూపు చూడడమేనని వారి దృష్టి లో హుస్నాబాద్ డివిజన్ కనపడటం లేదా అని జిల్లా విద్యాశాఖ తీరు పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు ఇట్టి విషయాన్ని జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సంఘ పక్షాన తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు.వెంటనే మంత్రి స్పందించి హుస్నాబాద్ లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. హుస్నాబాద్ మండల శాఖ అధ్యక్షులుగా బి. ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గా డి. సంపత్ రెడ్డి, అక్కన్నపేట మండల శాఖ అధ్యక్షులుగా ఈర్య,ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, కోహెడ మండల శాఖ అధ్యక్షులుగా ఎ. రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యం. సత్తయ్య లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎస్. ప్రభాకర్ రెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి,జిల్లా బాధ్యులు ఇంద్రసేనారెడ్డి, రాజిరెడ్డి, రవందర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరగాలి – మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి

షాబాద్, జూలై 9 (విజన్ ఆంధ్ర): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకుడు పట్నం అవినాష్ రెడ్డి బీఎల్వోలు కు సూచించారు.షాబాద్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బీఎల్వోలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని కోరారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అనర్హుల తొలగింపు, మార్పులు, చేర్పులు నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పూర్తి పారదర్శకతతో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమ ఇంచార్జి రాంబాబు యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగరావు, మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, పార్టీ నాయకులు రాజేందర్ రెడ్డి, పాండు, భూపాల్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి జూలై 10న 'చలో ప్రజా భవన్'

**-షాపూర్‌నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించిన యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి**

**-కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ హామీలను విస్మరించిందని విమర్శ**

**-పెండింగ్ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వెంటనే పంపిణీ చేయాలని విజ్ఞప్తి**

**- విద్యార్థులంతా పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు**

కుత్బుల్లాపూర్, జులై 9 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 10న నిర్వహించనున్న 'చలో ప్రజా భవన్' ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను షాపూర్‌నగర్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా తాటికొండ రవి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ విద్యను మరింత వ్యాపారీకరిస్తోందని ఆరోపించారు.

విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను తక్షణమే పంపిణీ చేయాలని, ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, వార్డెన్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలలను 'మన ఊరు--మన బడి' పథకం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. బీసీ వసతిగృహ ప్రవేశాల్లో అమలవుతున్న ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జూలై 10న నిర్వహించనున్న 'చలో ప్రజా భవన్' ముట్టడిలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తాటికొండ రవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి ధర్మతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# 250 కాలనీ లో పసుపు నేతల కనుసన్నల్లో భూ ఆక్రమణ యత్నం...

తిరుపతి, జులై 9 : కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి, మరో పక్క స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నేతల కను సన్నల్లో జెసిబి పెట్టి ఇళ్ల నిర్మాణాలకు కడగాళ్లు తీసే పనిలో నేతలు నిమగ్నమయ్యారు. ఇదంతా తిరుపతి రూరల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ రఘువర్మ, వీఆర్వో బాబు ఖాన్ ల సమక్షంలోనే జరుగుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన గురువారం తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామపంచాయతీ లోని 250 కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం సర్వేనెంబర్ 251/1 లో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిపై తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక నేతలు మాజీ సర్పంచ్ చిరంజీవి రెడ్డి, శ్యాం బాబు, జయచంద్ర ముదిరాజ్, రవి రెడ్డి ల కన్ను పడింది. దీంతో ఎమ్మెల్యే పులివర్తి నాని సిఫారసుతో రెవిన్యూ సిబ్బంది కనుసన్నల్లోనే భూఆక్రమణ ప్రారంభమైంది. 9 నివాస గృహాలు ఒకటిన్నర సెంటు చొప్పున ఇచ్చేలా ఒప్పందం చేసుకుని జెసిబి



సాయంతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి పనులు ప్రారంభించారు.

అడ్డుకున్న మాజీ సర్పంచ్, స్థానిక మహిళలు....

మాజీ సర్పంచ్ జనార్ధన్ యాదవ్, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున టిడిపి నేతలు ఆక్రమించే స్థలం వద్దకు చేరుకున్నారు. ఏళ్ల తరబడి ఇళ్ళు లేకుండా ఉంటున్న స్థానికులకు ఇవ్వాలని, వారంతా కూడా పులివర్తి నాని గెలుపు కోసం ఓట్లు వేశారని మాజీ సర్పంచ్ మీడియా సమావేశంలో చెప్పారు.

### ఆర్ ఐ, వి ఆర్ ఓ ల అనుమతి తోనే...

### అడ్డుకున్న మాజీ సర్పంచ్, స్థానిక మహిళలు

స్థానికంగా తెలుగుదేశం పార్టీ నాయకులని చెప్పుకుంటున్న వారి ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని పనులను నిలుపుదల చేశారు. మరో పక్క

ఆర్ ఐ రఘువర్మ టిడిపి నేతలకు వంతపడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించాలంటే మొదట వారికి చదివింపులు చదివిస్తే దగ్గరుండి పనులు చక్క పెడతారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్డీవో ఉన్నత స్థాయి అధికారులు జోక్యం చేసుకొని తిరుపతి రూరల్ మండలం తాసిల్దార్ కార్యాలయం లో జరుగుతున్న అవినీతి ఆరోపణల పై ప్రత్యేక దృష్టి సారించి గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉ ందని రూరల్ మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పొరపాటున వేరే వారికి డబ్బులు పంపారా కంగారు వద్దు

## ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూలై 9 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఆన్‌లైన్ పేమెంట్స్ వినియోగదారులకు ముఖ్య గమనిక... యూపీఐ యాప్స్ ద్వారా తప్పుగా వేరే నంబర్‌కు డబ్బులు పంపినట్లయితే వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ప్రస్తుత రోజుల్లో ఆన్‌లైన్ పేమెంట్ల వినియోగం విపరీతంగా పెరిగింది. అయితే, పేమెంట్ యాప్స్ ద్వారా డబ్బులు పంపేటప్పుడు ఒక్కోసారి తెలియక తప్పుడు నంబర్‌కు ట్రాన్సాక్షన్ చేస్తుంటారు. ఇలాంటి సమయంలో కంగారు పడకుండా ఈ క్రింది జాగ్రత్తలు తీసుకుంటే మీ డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంది. డబ్బులు తప్పుగా వెళ్లిన వెంటనే,ఆ ట్రాన్సాక్షన్ ఐ డి కనిపించేలా పూర్తి వివరాలతో ఒక స్క్రీన్‌షాట్ తీసి పెట్టుకోండి. ఏ యాప్ ద్వారా అయితే డబ్బులు పంపారో, వెంటనే ఆ సంబంధిత యాప్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి.

కస్టమర్ కేర్ నంబర్ల వివరాలు.

(గూగుల్ పే): 1800 419 0157

(ఫోన్ పే): 080 6872 7374 లేదా 022 6872 7374

(భీమ్ యాప్): 1800 120 1740

(పేటీఎం): 1204 456 456 (టోల్ ఫ్రీ నంబర్)

ప్రత్యామ్నాయ మార్గం:

ఒకవేళ కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ఎలాంటి ఫలితం లేకపోతే, వినియోగదారులు నేరుగా npci.org.in వెబ్‌సైట్ ద్వారా కూడా తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు.

# కాలనీల సమస్యలపై కమిషనర్‌కు వినతి

- కాలనీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సొంటి రెడ్డి పున్నారెడ్డి
- రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ప్రత్యేక ప్రస్తావన
- మౌలిక వసతుల కల్పనకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి
- కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కమిషనర్ సమావేశం
- అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని అధికారుల హామీ

గాజులరామారం, జులై 9 విజన్ ఆంధ్ర :సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాజులరామారం సర్కిల్--కుత్బుల్లాపూర్ జోన్‌లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాలనీ సంక్షేమ సంఘాల సమావేశంలో స్థానిక సమస్యలు ప్రధాన చర్చాంశంగా నిలిచాయి.

ఈ సమావేశంలో మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి గాజులరామారం సర్కిల్‌లోని పలు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, పారిశుధ్య నిర్వహణలో ఉన్న సమస్యలు, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాల నిర్వహణలో లోపాలు తదితర అంశాలను అధికారులకు వివరించారు. ప్రజల ఇబ్బందులను అత్యవసరంగా గుర్తించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కోరారు. కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వివిధ కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు కూడా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. సమస్యలను పరిశీలించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### పార్టీ సీనియర్ నాయకుడు అమరం కృష్ణారెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన బండి రమేష్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 9 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): బేగం పేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అమరం కృష్ణారెడ్డి, గురువారం పరమపదించారు. ఈ విషాద వార్త తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్, స్థానిక నాయకులతో కలిసి కృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి తనయుడు శ్రీనివాస్ రెడ్డిని కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ గారు మాట్లాడుతూ, అమరం కృష్ణారెడ్డి పార్టీ పట్ల అంకితభావంతో ఎంతోకాలం సేవలందించిన సీనియర్ నాయకుడని, ఆయన చేసిన సేవలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. దివంగత అమరం కృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, రమేష్, కరుణాకర్, విశాల్, భరత్, ఆలీ, సుజిత్ గౌడ్, అరుణ్, సురేష్, రమాదేవి, సురేష్ బాబు, అభిషేక్ తదితరులు పాల్గొని అమరం కృష్ణారెడ్డి గారికి ఘన నివాళులు అర్పించారు.

# తిమ్మారెడ్డిపల్లిలో దొంగతనం..

కుకునూరుపల్లి, జులై 09,విజన్ ఆంధ్ర : కొండపాక మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన గన్నేపల్లి చంద్రం మంగళవారం తన ఇంటికి తాళం వేసి పని నిమిత్తం వేరే ఊరికి వెళ్లారు. ఈరోజు ఉ దయం 9 గంటలకు తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు బంగారు ఉంగరాలు, భార్య, కూతురి వెండి పట్టీలు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది.

# పంచాయతీ కార్యదర్శి విధుల నిర్లక్ష్యంతో అమ్మాపూర్ గ్రామం అధ్వానం

- కార్యదర్శి నిర్లక్ష్యంతో విధులకు రావడం లేదు
- గ్రామ బాటలన్నీ పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయాయి
- డ్రైనేజీలలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది
- ఏడాదిగా ఫాగింగ్ లేక దోమల బెడద, జ్వరాలు పెరుగుతున్నాయి
- 5 ఏళ్లుగా ఒకే గ్రామంలో ఉన్నారు,వెంటనే బదిలీ చేయాలి అంటున్న గ్రామస్తులు

జడ్చర్ల / నవాబ్ పేట / జులై 9,(విజన్ ఆంధ్ర): నవాబుపేట మండలం అమ్మాపూర్ గ్రామంలో పరిశుభ్రత పూర్తిగా అధ్వానంగా మారింది. గ్రామ బాటలన్నీ పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒకరోజు విధులకు వచ్చి, మరోరోజు డుమ్మా కొడుతున్నారు. డుమ్మా కొట్టిన రోజును కూడా డిఎస్ఆర్ లో రెగ్యులర్ గా హాజరైనట్లు చూపిస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామ అభివృద్ధిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయింది. ఫలితంగా డ్రైనేజీలలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. బాటలకు ఇరువైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. రాత్రి సమయంలో బాట వెంట నడుచుకుంటూ వెళ్లాలంటే పాములు, ఇతర ప్రమాదాల భయంతో ప్రజలు వణికిపోతున్నారు. గ్రామంలో గత సంవత్సరం నుండి ఫాగింగ్ కూడా నిర్వహించలేదు. దీంతో దోమల బెడద పెరిగి జ్వరాల బాధితుల సంఖ్య పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత 5 సంవత్సరాలుగా ఒకే గ్రామంలో విధులు నిర్వహిస్తుండటంతో కార్యదర్శికి బాధ్యతలు మరిచిపోయారని ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కార్యదర్శిని ఈ మండలం నుండి వేరే మండలానికి బదిలీ చేయాలని, కలుపు తొలగింపు, ఫాగింగ్, డ్రైనేజీల శుభ్రత చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# SIR: చుక్కలు చూస్తున్న ఓటర్లు..

**ఎస్ఐఆర్-2002 వివరాలు తెలియక తంటాలు**

**ఎన్యూమరేషన్ పత్రం నింపడంలో అయోమయం**

మిడ్జిల్, జూలై 9 (విజన్ ఆంధ్ర) : ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్-సర్)లో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాలను నింపడంలో ఓటర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఎస్ఐఆర్-2002 వివరాలు అందుబాటులో లేకపోవడంతో పత్రాలను ఎలా పూరించాలో అర్థమవక, తప్పులు రాస్తే ఓటు పోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు ఇలా...

ఎన్యూమరేషన్ పత్రంలో ఎస్ఐఆర్-2002 వివరాలను ఏ బాక్సులో నింపాలి. ఎలా నింపాలి?

ఒకవేళ 2002లో ఓటరుగా నమోదు అయితే ఆ వివరాలను ఎలా సేకరించాలి?

చాలామంది ఓటర్లు పట్టణాలు, జిల్లాలు, రాష్ట్రాలు మారారు. అప్పటివివరాలు అందుబాటులోలేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఏంచేయాలి?

ఆన్‌లైన్‌లోవివరాలు తీసుకుందామంటే ఓటరు పేరు నమోదుచేస్తే ఎస్ఐఆర్-2002తో మ్యాచ్ కావడంలేదు.

జిల్లా కేంద్రాలు, పట్టణాల , మండల, వందల్లో పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. ఏ బూత్‌లో ఓటు ఉందో వెతకడం ఇబ్బందికరంగా మారుతోంది.

చాలామంది ఓటర్ల చిరునామాలు మారాయి. ప్రస్తుతమున్న ఇళ్లకే కొత్త ఇంటినంబర్లు వచ్చాయి. పోలింగ్‌బూత్‌ల కేంద్రాలు, నంబర్లు మారాయి.

కీలకం... ఎస్ఐఆర్-2002 వివరాలు

ఓటర్ల వద్దకు ఎన్యూమరేషన్ పత్రాలు రావడమే గగనంగా ఉంది. కొన్నిచోట్ల బీఎల్‌వోల ఫోన్‌నంబర్లను తెలుసుకుని వారివద్దకే వెళ్లి పత్రాలను తీసుకోవాల్సి వస్తోంది.

ఎన్యూమరేషన్ పత్రాల్లో రెండు బాక్సుల రూపంలో కాలమ్‌లు ఉన్నాయి. ఓటరుకు ఎస్ఐఆర్-2002లో ఓటు నమోదై ఉంటే... మొదటి బాక్సు కాలమ్‌లో ఆ వివరాలను నమోదు చేయాలి. ఓటరు పేరు, గుర్తింపు కార్డు, జిల్లా, రాష్ట్రం, నియోజకవర్గం సంఖ్య, భాగం సంఖ్య, క్రమ సంఖ్య వివరాలను నింపాలి. అయితే చాలామందికి ఈ వివరాలు తెలియడం లేదు. ప్రధానంగా పట్టణాలు, నగర ప్రాంతాల్లో ఉంటున్న, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డవారికి తమ పాత వివరాలను తెలుసుకోవడం కష్టంగా మారుతోంది. ఈసీఐనెట్ యాప్‌లో, వెబ్‌సైట్‌లో ఎస్ఐఆర్-2002 వివరాలను తెలుసుకోవచ్చని ఎన్నికల సంఘం ప్రకటనలు చేస్తున్నా... ఆన్‌లైన్‌లో వివరాలు సక్రమంగా రావడం లేదు. మరోవైపు పేర్లలో చిన్న తేడా ఉన్నా వాటి వివరాలు ఆన్‌లైన్‌లో చూపించడం లేదు.

2002 జాబితాలో పేరు లేని ఓటరు... రెండో బాక్సు(కాలమ్)లో తల్లిదండ్రులు, తాతా, నానమ్మ వివరాల్లో ఏదో ఒకటి నమోదు చేయాలి. ఇందులో వారి తల్లి/తండ్రి ఓటరు పేరు, గుర్తింపు కార్డు, జిల్లా, రాష్ట్రం, నియోజకవర్గం సంఖ్య, భాగం సంఖ్య, క్రమ సంఖ్య వివరాలను నింపాల్సి ఉంటుంది.

ఎస్ఐఆర్-2002 జాబితాలో పేర్లులేని, తల్లిదండ్రుల వివరాలు సైతం లేనివారు ఈ 2 బాక్సులను వదిలేసి కిందఉన్న మూడోబాక్సును మాత్రమే నింపాల్సి ఉంటుంది. ఇది తెలియక ఓటర్లు అవస్థలుపడుతున్నారు.

ఆ రెండు బాక్సులు నింపకుంటేనే నోటీసులు...

ఎన్యూమరేషన్ పత్రాల్లో పైనున్న రెండు బాక్సులను నింపకుంటే... సర్వే పూర్తయిన తర్వాత జులై 31 నుంచి ఆయా ఓటర్లకు నోటీసులను అందిస్తారు. ఈ సమయంలో ఎన్నికల సంఘం సూచించిన ధ్రువపత్రాలను ఈఆర్వోకు చూపించాల్సి ఉంటుంది. వాటిని సమయానికి ఈఆర్వో ముందు సమర్పించలేకపోతే ఓటును తీసి వేస్తారు.

2.38 కోట్ల ఓటర్లకు మ్యాపింగ్

ఎన్నికల సంఘం అధికారులు నిర్వహించిన మ్యాపింగ్‌లో 2,38,62,332 మంది ఎస్ఐఆర్-2002 జాబితాతో లింక్ అయి ఉన్నట్లు గుర్తించారు. చాలాచోట్ల బీఎల్‌వోలు స్థానికులు, గ్రామపెద్దలు, కాలనీ సంఘాలతో మాట్లాడి ఓటర్లను మ్యాపింగ్ చేశారు. ఎన్నికల అధికారుల రికార్డుల్లో మాత్రం మ్యాపింగ్ జరిగినట్లు ఉంటుంది. ఎన్యూమరేషన్ పత్రాలను నింపే సమయంలో మాత్రం ఈ మ్యాపింగ్‌కు సంబంధించిన ఎస్ఐఆర్-2002 వివరాలను చెప్పడంలో మాత్రం బీఎల్‌వోలు ఇబ్బందులు పడుతున్నారు.

# బెల్లంపల్లిలో అండర్-16, 19, 23 క్రికెట్ ఎంపికలు

బెల్లంపల్లి, జూలై 9 విజన్ ఆంధ్ర : తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న బెల్లంపల్లిలో మంచిర్యాల, కొమరం భీం జిల్లాల స్థాయి అండర్-16, అండర్-19, అండర్-23 క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పై డిమల్ల నర్సింగ్, కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, సీనియర్ కోచ్ జాడి శేఖర్ తెలిపారు.

స్థానిక శ్రీ మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ సొంత కిట్ బ్యాగ్, తెలుపు దుస్తులు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో జరిగే జోనల్ ఎంపికల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 6281420180, 798109809 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## షాబాద్ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**- గ్రామ పంచాయతీ కార్యాలయం, సి సి రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**- హాజరైన జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి**

షాబాద్, జూలై 09(విజన్ ఆంధ్ర) : షాబాద్ మండల పరిధిలోని లింగారెడ్డి గూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య గ్రామ పంచాయతీ నూతన కార్యాలయ భవనాన్ని గురువారం జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రజలకు అంకితం చేశారు.అనంతరంసాయిరెడ్డి గూడ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు యాదిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఈగ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి,ఉప సర్పంచ్ సక్కుబాయి, వార్డు సభ్యులు,పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ భావనతో విద్యార్థుల్లో నవచైతన్యం

**చింతల్ ఐడీపీఎల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం ఘనంగా నిర్వహణ**

**విద్యార్థులతో భారీ ర్యాలీ.. దేశభక్తి నినాదాలతో మారుమోగిన ఐడీపీఎల్**

**ముఖ్య అతిథులుగా డబ్ల్యూఓఎస్వై జాతీయ కన్వీనర్ నికిత, ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ రేగోడ్ నాగేష్**

**సమాజ సేవ, జాతీయ నిర్మాణంలో యువత ముందుండాలని పిలుపు**



కుత్బుల్లాపూర్, జూలై 9: విద్యార్థుల్లో జాతీయ చైతన్యం, సేవా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతల్ ఐడీపీఎల్ ప్రాంతంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో ర్యాలీని విజయవంతం చేయడంతో ప్రాంతం సందడిగా మారింది. ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో డబ్ల్యూఓఎస్వై (ఔెుష్) జాతీయ కన్వీనర్ నికిత, ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ రేగోడ్ నాగేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి విద్యార్థులేనని, విద్యతో పాటు సామాజిక బాధ్యత, దేశభక్తి, సేవా దృక్పథం ప్రతి విద్యార్థిలో అలవడాలని వారు సూచించారు. యువత తమ ప్రతిభను సమాజ అభ్యున్నతికి వినియోగిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో జాతీయతా భావాన్ని పెంపొందించడం, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం, సమాజానికి బాధ్యతాయుతమైన యువతను తీర్చిదిద్దడమే ఏబీవీపీ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొనడం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ మృత్యుంజయ్, మౌనిక, తరంగిణి, ఆశిష్, వివేక్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఒకరికి ఒకరు జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

# గుడుంబా తయారీదారులపై కఠిన చర్యలు

**- ప్రభుత్వ పథకాలు రద్దవుతాయని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ హెచ్చరిక**

**- అడ్వాలపల్లిలో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్... 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం**

మల్హర్, జూలై 9 విజన్ ఆంధ్ర : భూపాలపల్లి జిల్లా ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్వాలపల్లి గ్రామంలో గురువారం ఉదయం పోలీసులు భారీ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాటారం డీఎస్పీ సూర్య నారాయణ ఆధ్వర్యంలో, కాటారం సీఐ నాగార్జున రావు, కొయ్యూరు ఎస్సై మహేందర్ కుమార్, కాటారం ఎస్సై శ్రీనివాస్ మరియు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ సూర్యనారాయణ గ్రామ ప్రజలతో మాట్లాడుతూ.. అడ్వాలపల్లి గ్రామంలో గుడుంబా తయారీదారులు అధికంగా ఉన్నట్లు గుర్తించామని, వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా వ్యాపారం మానుకోని పక్షంలో, వారికి ప్రభుత్వ పరంగా అందే అన్ని రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసేలా ఉన్నతాధికారులకు నివేదిస్తామని స్పష్టం చేశారు.అనంతరం కాటారం సీఐ నాగార్జున రావు మాట్లాడుతూ.. ప్రజలంతా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. మైనర్ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులను కోరారు. 38 లీటర్ల గుడుంబా స్వాధీనం – ముగ్గురిపై కేసు నమోదు: ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు పలువురి నుంచి 38 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 800 లీటర్ల పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేద్దాం

## పివైఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య

గద్వాల జూలై 9 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి నెట్టివేస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పివైఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమి, హాస్టళ్లలో సమస్యలు, విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలు లేకపోవడం వంటి అనేక సమస్యలు పరిష్కారం కాకుండానే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా తదితర పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యను హక్కుగా కాకుండా వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, ప్రభుత్వ పాఠశాలలు--కళాశాలలకు




అవసరమైన నిధులు కేటాయించడం, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడం, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించడం కోసం జులై 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, యువజనులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, ప్రజలందరూ సంపూర్ణంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా విద్యను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం జరిగే ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జయరాజ్, దిలీప్, శ్యామ్, చరణ్, కర్ణాకర్, ఆనంద్, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ జన్మదిన వేడుకలు

చర్ల, జూలై 9 (విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి, మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు, ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ హాజరై కేక్ కట్ చేసి మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు

ఈ సందర్భంగా నల్లపు దుర్గాప్రసాద్ మరియు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మురళీకృష్ణ చేస్తున్న కృషిని అభినందించారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# కవిత చేసిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలి



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన ఎంపీ అర్వింద్ ధర్మపురి

నిజామాబాద్ జూలై 09:(విజన్ ఆంధ్ర )స్వయంగా కెసిఆర్ కుటుంబ సభ్యురాలు,ఇంటి మనిషి కవిత బి ఆర్ ఎస్ పార్టీ ,కేటీఆర్ ,హరీష్ రావుల మీద చేసిన అవినీతి,క్విడ్ ప్రో కో ఆరోపణల మీద సిబిఐ చేత వెంటనే విచారణ జరిపించాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ పార్టీ నిధులు, క్విడ్ ప్రో కో లావాదేవీలు, ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌తో జరిగినట్లు ఆరోపించిన ఒప్పందాలు, ఫీనిక్స్ సంస్థకు రాజకీయ అండ, గత ప్రభుత్వం మరియు ప్రస్తుత ప్రభుత్వం ఆంధ్రా కాంట్రాక్టర్లకు భూముల కేటాయింపులపై కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.

ఈ ఆరోపణలు ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవని, వీటిపై ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా స్వతంత్ర సీబీఐ దర్యాప్తు జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి మీద దర్యాప్తును సిబిఐ కి అప్పగించడంలో జరిగిన జాప్యం,ఈ-కార్ రేసులో అవినీతికి పాల్పడ్డట్టు ఆధారాలున్నా విచారణ చేపట్టకుండా కేటీఆర్ ని రక్షించడం ,ఫోన్ టాపింగ్ కుంభకోణం బాధ్యులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోపోవడంవల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధిని ప్రజలు ఇప్పటికే శంకిస్తున్నారని,కాంగ్రెస్- బీఆర్ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని ప్రజలు భావిస్తున్నారని అర్వింద్ పేర్కొన్నారు

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని, పూర్తి పారదర్శకతతో నిజానిజాలను వెలుగులోకి తీసుకువచ్చి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని కలిసిన ఇరిగేషన్ ఎస్ఈ

## - నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే తో భేటీ - పలు అంశాల పై చర్చ

నిజామాబాద్ : ఇటీవల నిజామాబాద్ ఇరిగేషన్ ఎస్ఈ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుణవంత్ రావు గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలు అంశాల పై చర్చించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

# రహదారి విస్తరించినా తొలగని విద్యుత్ స్తంభాలు

## - చర్లలో వాహనదారుల అవస్థలు

## - పొంచి ఉన్న పెను ప్రమాదం

### - పాత విరిగిన స్తంభాలతోనే మమా అనిపించిన విద్యుత్ శాఖ అధికారులు

చర్ల , జూలై 9 (విజన్ ఆంధ్ర): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు మాజీ సర్పంచ్ కృష్ణార్జునరావు హయం లో పూర్తయినప్పటికీ ప్రయాణానికి మార్గం సుగమమైందని అందరూ సంతోషించారు, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది, రహదారి విస్తరణ జరిగినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పాత విద్యుత్ స్తంభాలను తొలగించకుండా నిర్లక్ష్యం వహించడంపై మండల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు,

**అడ్డంకులుగా మారిన స్తంభాలు**

గత సర్పంచ్ హయాంలో వచ్చిన కొత్తలోనే ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టారు అయితే, రహదారి విస్తరించిన మేరకు విద్యుత్ స్తంభాలను పక్కకు జరపడంలో విద్యుత్ శాఖ విఫలమైంది, పాత రహదారి అంచున ఉన్న స్తంభాలను అలాగే వదిలేసి, కేవలం కొత్త స్తంభాల నుంచి పాత వాటికి విద్యుత్ తీగలను అనుసంధానం చేయడంతో, అవి ఇప్పుడు రోడ్డు మధ్యలో ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి, ముఖ్యంగా అంబేద్కర్ సెంటర్ సమీపం నుంచి బస్టాండ్ ఏరియా వరకు పరిస్థితి అధ్వాన్నంగా మారింది, విద్యుత్ స్తంభాలు క్రమ పద్ధతిలో లేకుండా ముందుకు వెనుకకు ఉండడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలిగే పరిష్ ఏర్పడింది భారీ వాహనాల రద్దీ పెరిగిన దృశ్య ఎప్పుడు రోడ్డుకు దగ్గరగా ఉన్న స్తంభాలకు తగిలి ఏ ప్రమాదం జరుగుతుందోనని మండల ప్రజలు భయాందోళనకు గురుతున్నారు

**ప్రమాదకరంగా ప్రయాణం**

ఈ మార్గం అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి, రోడ్డుపైనే అనవసరంగా నిలిచి ఉన్న విద్యుత్ స్తంభాలు భారీ వాహనాలకు పెద్ద అడ్డంకిగా మారాయి, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ఈ స్తంభాలను గమనించక ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

**ప్రశ్నార్థకంగా అధికారుల తీరు**

కొన్ని ప్రాంతాల్లో స్తంభాలను క్రమ పద్ధతిలో మార్చిన విద్యుత్ శాఖ, ప్రధాన కూడళ్ల వద్ద మాత్రం ఎందుకు విస్మరించిందోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, రహదారి అభివృద్ధికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా, అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడం వెనుక ఉన్న మతలబు ఏంటని స్థానికులు నిలదీస్తున్నారు

**వర్షాకాలం రావడంతో మరింత భయం**

విరిగిపోయిన స్తంభాలు బయటికి చూపులు కనిపించే లాగా స్తంభాలు వర్షానికి తడిసి ఎక్కడ విద్యుత్ ఇస్తాయో తెలియక ప్రజలు భయాందోళన రోడ్లపై ప్రయాణం చేస్తున్నారు ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు తడిసి విద్యుత్ ఘాతం కలిగించే అవకాశం మెండిగా ఉన్నప్పటికి , ఎప్పుడు స్తంభాలు విరిగి కింద పడతాయో తెలియని పరిస్థితి కనిపిస్తుంది, విద్యుత్ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు



**తక్షణ చర్యలు చేపట్టాలి**

మండల అభివృద్ధిలో భాగంగా జరిగిన రహదారి విస్తరణకు, విద్యుత్ స్తంభాల సమస్య అడ్డుగా మారింది, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, రోడ్డు మార్జిన్లకు అనుగుణంగా క్రమబద్ధీకరించాలని చర్ల మండల ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉంది.



## గాంధీనగర్‌లో చోరీ.. బీరువాలకు నిప్పు

బెల్లంపల్లి జులై 9 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డు గాంధీనగర్‌లో జవాజీ రాజేశం ఇంట్లో గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అనంతరం ఇంట్లోని రెండు బీరువాలకు నిప్పంటించి పరారయ్యారు. సమాచారం అందుకున్న 13వ వార్డు కౌన్సిలర్ దొంగల రాజ్‌కుమార్ యాదవ్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆయన 2టౌన్ ఎస్ఐకి సమాచారం ఇవ్వడంతో 2టౌన్ ఎసై సంఘటన స్లానికి చేరుకుని ఆయన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు
కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎసై తెలిపారు.

# మారుమూల గ్రామంలో ఎస్ ఏ ఆర్ సర్వే

**- విద్యా ప్రగతిపై డిప్యూటీ కలెక్టర్ మురళి ప్రత్యేక దృష్టి**

చర్ల, జులై 9 (విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని మారుమూల అటవీ గ్రామమైన రాల్లాపురంలో డిప్యూటీ కలెక్టర్ మురళి క్షేత్రస్థాయిలో పర్యటించారు, ఈ పర్యటనలో భాగంగా ఆయన స్థానిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు

**అభ్యాసన సామర్థ్యాల పెంపునకు సార్ (ఎస్ ఐ ఆర్) సర్వే**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఏంటెన్సీ రివిజన్ ) సర్వేలో భాగంగా ఈ పర్యటన సాగింది, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు అనంతరం పాఠశాలల సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను, వారికున్న అవగాహనను డిప్యూటీ కలెక్టర్ నిశితంగా పరిశీలించారు, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఈ సర్వే కీలకమని ఆయన పేర్కొన్నారు

**పాఠశాల మౌలిక సదుపాయాలపై భరోసా**

పాఠశాలను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్ అక్కడ ప్రహరీ గోడ లేకపోవడాన్ని గమనించారు, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని త్వరలోనే ప్రహరీ గోడ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు, అలాగే పాఠశాలలోని వంటశాలను పటిష్టపరచాలని ఎస్‌జీటీ జబీనా చేసిన విన్నపానికి సానుకూలంగా స్పందించారు , మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎటువంటి లోపాలు లేకుండా, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సి ఆర్ పి పాపారావును ఆదేశించారు

ఉపాధ్యాయుల సేవలకు ప్రశంసలు



అటవీ ప్రాంతంలో ఉండి విద్యార్థులకు జ్ఞానాన్ని వారి ప్రత్యేక అవసరాలను అందిస్తున్న చిన్న మెడిసిలేరు కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ పాపారావు ను ఉపాధ్యాయురాలు జబీనా నిబద్ధతను, సేవలను డిప్యూటీ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు, మహిళా ఉపాధ్యాయులుగా ఉంటూ అడవి ప్రాంతంలో విద్యను బోధించిన పట్ల ప్రశంసించారు,

**గ్రామస్తులతో ముఖాముఖి**

పర్యటనలో భాగంగా గ్రామస్తులతో మాట్లాడిన డిప్యూటీ కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు, ప్రతి ఒక్కరూ చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఉత్తమ అలవాట్లను అలవర్చుకోవాలని గ్రామస్తులకు సూచించారు, డిప్యూటీ కలెక్టర్ మురళి వెంట రెవెన్యూ శాఖ సంబంధిత ఉద్యోగి రాజేంద్ర ప్రసాద్, తదితరులున్నారు

# బర్ధిపూర్ గ్రామంలో సర్ ప్రక్రియ వేగవంతం...

బోధన్, జులై09 (విజన్ ఆంధ్ర) : కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) బోధన్ మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో అత్యంత వేగంగా కొనసాగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, జాబితాలో ఉన్న లోపాలను పూర్తిగా నివారించడమే లక్ష్యంగా స్థానిక ఎన్నికల యంత్రాంగం రంగంలోకి దిగింది. ?గ్రామంలోని పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవెల్ అధికారులు ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ల సమక్షంలో అధికారులు నేరుగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన ఫారాలను జీపీఓ బసవయ్య, బిఎల్ఓ భూమయ్య లు ఓటర్లకు అందించి, వాటిని పూర్తి చేసి తిరిగి సేకరించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సారగం పోతిరెడ్డి, కోట గిరారెడ్డి, ఉప సర్పంచ్ హనుమాండ్లు, బిఎల్ఏ నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వర్ష ఆధారిత మండలాల్లో చెరువులను గోదావరి జలాలతో నింపాలి

**- ఏన్కూరు, కామేపల్లి, కారేపల్లి మండలాలకు తక్షణమే గోదావరి జలాలు అందించాలి**

**- చింతకాని రైతు భరోసా సభ లో ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలి**

**- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ**

ఏన్కూరు, జూలై 9(విజన్ ఆంధ్ర): ఖమ్మం జిల్లాలో ఉన్న చెరువులను గోదావరి జలాలతో నింపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏన్కూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఏన్కూరు, కామేపల్లి, కారేపల్లి మండలాలకు తక్షణమే గోదావరి జలాలు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు విడుదలపైన చింతకాని రైతు భరోసా సభలో ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన తొమ్మిది వేల కోట్ల రూపాయలను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేయుటకు రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం చేయాలని కోరారు. ఖమ్మం జిల్లాలో అత్యంత వర్షా ఆధారిత కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు, రఘునాథ పాలెం, ఖమ్మం రూరల్ మండలాలు సాగు భూమికి నీరు



అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కామేపల్లి మండలంలో సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు పరిహారం అవార్డు 2019లో ప్రకటించి నేటికి రైతులకు పరిహారం అందించలేదని అన్నారు. పరిహారం ఇవ్వకపోగా రైతులకు రైతు భరోసా నిధులు కూడా ఇవ్వడం లేదని, ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దొంతబోయిన నాగేశ్వరరావు, భూ నిర్వాసితుల సంఘం నాయకులు ఎస్ కె షరీఫ్, వెంకన్న, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఫరూక్‌నగర్‌లో ప్రధానోపాధ్యాయులకు నులిపురుగుల నివారణపై అవగాహన

**- 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు**

షాద్ నగర్, విజన్ ఆంధ్రా జులై 9 : జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఫరూక్‌నగర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వి. విజయలక్ష్మి, మండల విద్యాధికారి మనోహర్, ఎంపీడీవో శ్రీకాంత్ హాజరయ్యారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ...నులిపురుగులు కలుషితమైన ఆహారం, నీరు, అపరిశుభ్రత, చెప్పులు లేకుండా నడవడం వంటి కారణాలతో శరీరంలోకి ప్రవేశించి పలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని వివరించారు. గుండ్రపు పురుగు, కొరడా పురుగు, కొంకి పురుగు, దారపు పురుగు, బద్దె పురుగు వంటి ఐదు రకాల



నులిపురుగుల గురించి వివరించి, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ...నులిపురుగుల వల్ల కడుపునొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తహీనత, అలసట, పిల్లల్లో ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు వస్తాయని చెప్పారు. పరిశుభ్రత పాటించడం, సబ్బుతో చేతులు కడుక్కోవడం, చెప్పులు ధరించడం, మరుగుదొడ్లు వినియోగించడం వంటి అలవాట్లతో పాటు వైద్యుల సూచన మేరకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ వి. విజయలక్ష్మి మాట్లాడుతూ... ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని తెలిపారు. జూలై 13న మాత్ర తీసుకోలేని వారికి ఈ నెల 20న నిర్వహించే మాప్-అప్ డేలో మాత్రలు అందజేయనున్నట్లు చెప్పారు. ఎంఈవో మనోహర్ మాట్లాడుతూ... ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరగా, ఎంపీడీవో శ్రీకాంత్ అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# 'గడువులోపు సర్ ప్రక్రియ పూర్తి చేయాలి'

## - మందమర్రి తహసీల్దార్ సతీష్

మందమర్రి, జూలై 9 (విజన్ ఆంధ్ర) : ప్రతి ఇంటింటికీ తిరుగుతూ ఎన్యూమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాలు నమోదు చేస్తూ ఆన్లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియను గడువు లోపు పూర్తి చేయాలని మందమర్రి తహసిల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. గురువారం క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న సర్ ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ప్రతి వార్డుల్లో తిరుగుతూ బిఎల్ఓ, బిఎల్ఎల పని తీరును పరిశీలించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత బిఎల్ఓ,బిఎల్ఎ లదే అన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలలో నమోదు చేసిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు వచ్చిన తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలన్నారు.

# ఆదమరిస్తే అంతే సంగతి

## - మూలమలుపును కమ్మేసిన ముళ్లపొదలు

చిలిపిచేడ్ జూలై 9 విజన్ ఆంధ్ర: చిలిపిచేడ్ మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామ శివారులో బండపోతుగల్ అజ్జమర్రి గ్రామాలకు వెళ్లే రహదారిలో ఫైజాబాద్ గ్రామం దాటగానే ఉన్న మూలమలుపుకు ఒకవైపు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఉండగా మరోవైపు ముళ్ళపొదలు కప్పుకొస్తున్నాయి. ఆదమరచినా, ఎదురుగా వస్తున్న పెద్ద వాహనాన్ని గుర్తించకపోయినా ఇక అంతే సంగతి. బండపోతుగల్, అజ్జమర్రి గ్రామాలకు కాస్త చీకటి పడ్డాక వెళ్లాలంటే భయంగా ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు చెప్పుకొచ్చారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్య తీసుకోగలరని వేడుకున్నారు.

# మాలపల్లిలో బోర్ వెల్ రీఛార్జ్ పిటకు శ్రీకారం

## అభివృద్ధి పనులను పరిశీలించిన డీఆర్డీఓ

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూలై 9 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బోర్వెల్ రీఛార్జ్ పిట్ మార్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలతరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అధికారి బోర్ వెల్ రీఛార్జ్ పిట్ను మార్కింగ్ చేసి, వృథాగా పోతున్న వర్షపు నీటిని ఈ పిట్ ద్వారా భూమిలోకి ఇంకేలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోరుబావులకు నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే గ్రామంలో మురుగునీరు నిల్వగా ఉన్న మోరీ కాలువ వద్ద మ్యాజిక్ డ్రెయిన్ నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్న రాజు, ఏపీఓ పద్మ, ఈసీ పరుశరాములు, పంచాయతీ కార్యదర్శి దివ్య, ఉపసర్పంచ్ బత్తుల శ్రీనివాస్, ఈజీఎస్ టీఏ భాస్కర్, వార్డు సభ్యులు బత్తుల వీరస్వామి, సొల్లు రజనీకాంత్, గుండాల ప్రశాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, సిబ్బంది అనిల్, సారయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.






# క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

## -విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ ప్రశంసా పత్రాలు అందజేత

కారేపల్లి,జూలై 10(విజన్ ఆంధ్ర) : క్రమశిక్షణతో ఉంటేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చనీ కస్తూర్బా కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ సౌజన్య తెలిపారు. కస్తూర్బ విద్యాలయంలో 129 మంది విద్యార్థులు ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ లో 90 శాతం హాజరుతో తరగతులకు హాజరైనందున వారికి గురువారం ఝాన్సీ సౌజన్య ఎఫ్ ఆర్ ఎస్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 14కేజీబీవీ విద్యాలయాల్లో అత్యధికంగా కారేపల్లి కస్తూర్బ విద్యాలయానికి ప్రశంసా పత్రాలు వచ్చాయన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరైతే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. అలాగే 14 మంది ఉపాధ్యాయులకు కూడా ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ లో 90 శాతం సాధించినందుకు వారికి ప్రశంసా పత్రాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం అధ్యాపక సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేశాడా..?

## - చనిపోయిన తండ్రి కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎదురుచూపులు..!

చేవెళ్ల, జూలై 09 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని బాధిత కుటుంబ సభ్యులు విడుదల చేసిన కరపత్రం, గురువారం చేవెళ్ల వారపు మార్కెట్ (అంగడి)లో మృతుడు చదువు గండయ్య కుమారుడు చదువు కిష్టయ్య ప్రజలకు పంపిణీ చేయడం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశమైంది. కరపత్రంలోని వివరాల ప్రకారం, చిలుకూరు గ్రామానికి చెందిన కీ॥శే॥ చదువు గండయ్య 2002లోనే మరణించినప్పటికీ, 2026 ఫిబ్రవరి 27న తహసీల్దార్ గౌతమ్ కుమార్ ఎదుట ప్రత్యక్షమై తన పేరిట ఉన్న 7 ఎకరాల 32 గుంటల భూమిలో 6 ఎకరాలను గొట్టిముక్కల శ్రీనివాసరాజు అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసినట్లు రికార్డులు నమోదయ్యాయని ఆరోపించారు. మరణించిన వ్యక్తి రిజిస్ట్రేషన్ ఎలా చేశాడని ప్రశ్నిస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరపత్రంలో వ్యంగ్యంగా, "మా తండ్రి తహసీల్దార్ గౌతమ్ కుమార్ కార్యాలయానికి వచ్చి వెళ్లిపోయాడని తెలిసింది. కనీసం ఇంటికి వచ్చి ఓ గ్లాసు మంచినీళ్లు తాగి వెళ్లి ఉంటే బాగుండేది. ఇప్పుడు మా తండ్రి మళ్లీ మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వస్తాడేమోనని ఇంటికి తీసుకెళ్లేందుకు కార్యాలయం గేటు ముందు కావలి కాస్తున్నాం" అని పేర్కొన్నారు. మరణించిన వ్యక్తి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి భూమి రిజిస్ట్రేషన్ చేయడం ఎలా సాధ్యమైందని ప్రశ్నిస్తూ, ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని కోరారు.

# తెలంగాణ గోల్కొండ వరకవి సిద్దప్ప జయంతి వేడుకలు...

## - ఘనంగా నివాళులు అర్పించిన...

## - సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు

అక్కన్నపేట జూలై 9 విజన్ ఆంధ్ర : సాహితీ ఘనకీర్తి గల వజ్ర కిరీటం గోల్కొండ కవి,రాజయోగి,వరకవి సిద్దప్ప 123వ,జయంతి వేడుకలు సామాజిక కార్యకర్త,కంటస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా....

వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....

భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పడింది.,కాని సమగ్ర సాహిత్య సాంస్కృతిక భాషా చరిత్ర ఏర్పడలేదు. ప్రధాన స్రవంతి చరిత్ర మరింత విస్తరించింది. విలువైన ఎన్నో విలక్షణ పాయలు పక్కకు నెట్టబడ్డాయి. ఈ కోణంలో కొరవడిన ప్రజాస్వామిక దృక్పథం వల్ల ఎంతోమంది కవులు,రచయితలు ఎజెండాపైకి రాలేక పోయారు. అలాంటివారిలో సిద్దప్ప వరకవి ఒకరు.అతను కళ్ళు తెరిచేనాటికి హైదరాబాదు సంస్థానంలో ప్రజల స్థితిగతులు ఒడిదొడుకులతో కూరుకుపోయింది.అతడు యవ్వనదశలోకి వచ్చేనాటికి ఆంధ్రజన కేంద్ర సంఘం (1921) ఏర్పడింది. మొత్తం సంస్థానంలో ప్రజలు పాలకుల మధ్య అంతరాయం ఏర్పడింది.మరోవైపు సామాజికంగా కరడుగట్టిన విశ్వాసాలు,సాంఘిక కట్టు బాట్లు ఊపిరి సలపనివ్వలేదు. ప్రధాన వనరులైన భూమి,రాజ్యాధికారంకోసం సాయుధపోరు,రాజకీయపోరు ఉధృతమయ్యాయి.తెలంగాణమంతా ఒక కాన్సంట్రేషన్ క్యాంప్లా మారింది.అటువంటి ఉక్కపోత వాతావరణంలో మానవ స్వభావసిద్ధమైన ప్రశాంతత కోసం, అర్థరహిత ఆంక్షలను తెంచడం కోసం రాజకీయ స్పృహ కు అతీతంగా,అనుభవ జ్ఞానమే చోదక శక్తిగా ప్రజల్లో వెలుతురు నింపడం కోసం అనేక రచన లు చేసిన గొప్ప కవి సిద్దప్ప అని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నాంపల్లి సమ్మయ్య - స్వరూప, ఎస్ రమేష్,సంపత్, శంకర్,భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన జరగాలి

## - కొంశేట్పల్లి పాఠశాలలను సందర్శించిన మండల విద్యాధికారి అశోక్

## - బోధనా విధానం, విద్యార్థుల నోట్బుక్స్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలన

మర్పల్లి జూలై 9 (విజన్ ఆంధ్ర): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని అప్పుడే వారికి చదువుపై శ్రద్ధ రిగి బడికి రోజు వస్తారని మండల విద్యాధికారి అశోక్ అన్నారు.

గురువారం మండల విద్యాధికారి అశోక్ఉ దయం ప్రార్థన సమయంలో కొంశేట్పల్లి ప్రభుత్వ ప్రాథమిక తెలుగు, ఉర్దూ మాధ్యమ పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించి, విద్యార్థులకు మరింత సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు పలు సూచనలు చేశారు.విద్యార్థుల నోట్బుక్స్, వర్క్బుక్స్ను పరిశీలించిన ఆయన, పిల్లల చేతిరాత చక్కగా ఉందని ప్రశంసించారు. ఉపాధ్యాయులు ఎలా రాస్తున్నారో విద్యార్థులు కూడా అదే విధంగా అనుసరిస్తున్నారని అభినందించారు. అనంతరం పాఠశాలలో



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతపై ఆరా తీశారు. గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

అనంతరం మొగిల్లిగుండ్ల పాఠశాలను సందర్శించి అక్కడి విద్యా పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ రమేష్, సర్పంచ్ రాచన్న, ఉపసర్పంచ్ తదితరులతో మాట్లాడారు.

ఈ సందర్శనలో హెడ్మాస్టర్ లావణ్య, ఉపాధ్యాయులు శోభ, పదాల లావణ్య, నూరొద్దీన్, సీఆర్పీ మల్లేశం పాల్గొన్నారు.

## ముత్తారంలో ఆయిల్ పామ్ సాగుపై శాస్త్రీయ అవగాహన

ముత్తారం,జులై 09(విజన్ ఆంధ్ర) : మండలంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులకు అవగాహన కార్యక్రమంతో పాటు క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు.భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా. కె. రామచంద్రుడు పాల్గొని శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, పురుగు--తెగుళ్ల నివారణపై రైతులకు వివరించారు.వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పరాగసంపర్కం తగ్గి గెలల రాలిపోవడం వంటి సమస్యలపై అవగాహన కల్పించారు.పెద్దపల్లి జిల్లా వాతావరణం ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని,శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులతో పాటు స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు.అనంతరం ఆయిల్ పామ్ తోటలను పరిశీలించి రైతులకు అవసరమైన సలహాలు ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్,తిరుమల ఆయిల్ కెమ్ సీఈఓ కేశ కళ్యాకర్,ఉద్యాన శాఖ అధికారులు,ఫీల్డ్ ఆఫీసర్లు, రైతులు నాంసాని సమ్మయ్య, గుజ్జుల రాజిరెడ్డి,బుచ్చరావు పాల్గొన్నారు.

## అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లి జులై 9 విజన్ ఆంధ్ర ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికలు, కార్యాలయ రికార్డులు, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివరాల నమోదు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు, సిబ్బంది విదుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించాలని తెలిపారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని, ఈ నెల 24వ తేదీ లోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్ల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలలో పొందుపరిచిన సమాచారాన్ని బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులుగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూభారతి పెండేసి వివరాలను పరిశీలించారు. వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు.

## ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



వాజేడు,జులై9(విజన్ ఆంధ్ర): పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు గురువారం వాజేడు మండల కేంద్రంలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, నాయకులు, కార్యకర్తలు ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు కాకర్లపూడి విక్రాంత్ మాట్లాడుతూ... గిరిజన కుటుంబంలో పుట్టి ఎంతో ఎత్తుకు ఎదిగి మంత్రిగా ములుగు జిల్లాకు ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు.నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ బాబు, ఎల్లయ్య,జగన్నాధరాజు, సీతారా మరాజు, పుష్పలత, వాజేడు నాగారం సర్పంచ్ స్వరూప, ఖాజావలి, షబీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు..

### నాణ్యమైన విద్యే లక్ష్యం: కలెక్టర్



బెల్లంపల్లి జులై 09 విజన్ ఆంధ్ర : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం నెన్నెల మండలం ఆవడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, సైన్స్ ల్యాబ్ నిర్వహణ, పాఠశాల రిజిస్టర్లను పరిశీలించారు.

జిల్లాలో 700కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 44 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ విద్యా సంవత్సరంలో గత ఏడాదితో పోలిస్తే అడ్మిషన్లు 3 శాతం పెరిగాయని తెలిపారు. జిల్లాలో 320 మంది ఉపాధ్యాయులను నియమించడంతో పాటు విద్యారంగ అభివృద్ధికి రూ.150 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, బాలురు--బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు, భోజనశాలలు, అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. హరే రామ--హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కారణంగా అడ్మిషన్లు పెరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు.

## మహారత్న కళ్ళకు పొరలు.. 'ఆ ఆరుగురే' జర్నలిస్టులా?

- ఏటా ఆ ఆరుగురికే ఇండస్ట్రియల్ టూర్ భాగ్యం
- మేనేజ్‌మెంట్‌ను గుప్పిట్లో పెట్టుకున్న 'ఆరుగురి' ముఠా!
- వార్త రాయడానికి అందరూ కావాలి.. టూర్లకెళ్లడానికి 'ఆ ఆరుగురే' కావాలా?
- అందరి శ్రమతో వెలుగులు.. టూర్ల విషయానికొస్తే చీకట్లు
- ప్రభుత్వ రంగ సంస్థలో సమన్యాయం కనుమరుగు




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జులై 09 (విజన్ ఆంధ్ర) : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 'మహారత్న' ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ తీరు ఇప్పుడు స్థానిక జర్నలిస్టుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏటా నిర్వహించే ప్రతిష్టాత్మక 'ఇండస్ట్రియల్ టూర్' (పారిశ్రామిక పర్యటన) వ్యవహారం చూస్తుంటే.. ఎన్టీపీసీ యాజమాన్యానికి ఒకే ఒక్క ఏరియాకు చెందిన ఆరుగురు జర్నలిస్టులు తప్ప, మిగతా వారెవ్వరూ జర్నలిస్టుల్లాగే కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'మహారత్న' చూపు.. అంతా ఒకే వైపు!

దేశానికే వెలుగులు పంచే ఎన్టీపీసీ సంస్థ, స్థానిక పాత్రికేయుల విషయంలో మాత్రం తీవ్ర పక్షపాతాన్ని ప్రదర్శిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. రామగుండం నియోజకవర్గ వ్యాప్తంగా ఎంతో మంది సీనియర్, జూనియర్ జర్నలిస్టులు రాత్రింబవళ్లు శ్రమిస్తూ, సంస్థకు సంబంధించిన వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కానీ, ఏటా వచ్చే సరికి ఆ 'ఆరుగురు మహానుభావులకే' ఇండస్ట్రియల్ టూర్ భాగ్యం దక్కుతుండటం గమనార్హం.

ప్రశ్నార్థకంగా మారిన పారదర్శక

ఒకే ఏరియాకు చెందిన కొద్దిమందికే ప్రతి ఏటా ఈ లగ్జరీ టూర్లు ఎలా కేటాయిస్తారు? మిగతా ప్రాంతాల జర్నలిస్టులు రాసే వార్తల్లో క్వాలిటీ లేదా? లేక వారిపై ఎన్టీపీసీ పీఆర్ఓ విభాగాలకు అంత అలుసా?

కనుమరుగైన 'సమన్యాయం'.. గుండెల్లో రగులుతున్న ఆవేదన

నిజాయితీగా వార్తలు రాస్తూ, సంస్థ ప్రగతిని సమాజానికి చాటిచెప్పే మిగతా జర్నలిస్టుల శ్రమ ఎన్టీపీసీ కళ్ళకు ఆనడం లేదా? ఈ వివక్ష స్థానిక జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోంది. ఒకరిద్దరిని నెత్తిన పెట్టుకుని, మిగతా వారిని విస్మరించడం ఏ రకమైన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్.) అని ప్రశ్నిస్తున్నారు.

ఏడాది పొడవునా కష్టం ఒకరిది

ఎన్టీపీసీ ఈవెంట్లు, ప్రెస్ మీట్లకు అందరినీ పిలవడం. ఎండార్స్‌మెంట్లు, టూర్లు మరొకరికి. పర్యటనలు, ప్రత్యేక ప్రయోజనాల విషయానికి వస్తే మాత్రం 'ఆ ఆరుగురికే' ప్రాధాన్యత ఇవ్వడం. ఇకనైనా మారాలి.. అందరికీ న్యాయం జరగాలి

ఒక పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఎన్టీపీసీ అందరినీ సమానంగా చూడాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక వర్గానికో, ఒక ఏరియాకో పరిమితం కాకుండా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఈ పారిశ్రామిక పర్యటనల్లో అవకాశం కల్పించాలి. మహారత్న కంపెనీ యాజమాన్యం ఈ పక్షపాత ధోరణిని వీడి, ఇకనైనా కళ్ళు తెరిచి అందరికీ సమన్యాయం చేకూరుస్తుందని ఆశిద్దాం.